

ఉష్ణోగ్రత (అంచనా)

26-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	26
తెనాలి	38	26
నరసరావుపేట	40	24
బాపట్ల	36	27
రెంటచింతల	41	26

ఉపాధి పనిదినాల్లో.. భారీగా కోత!

- తగ్గిన 12.70 లక్షల పనిదినాలు
- అమలు కాని రూ.307 కనీస వేతనం
- జిల్లాలో సగటు వేతనం రూ.282 మాత్రమే

ఆర్థిక సంవత్సరం	పనిదినాలు
2022-23	94,05,074
2023-24	84,76,071
2024-25	87,48,695
2025-26	74,77,946



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 5.88 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేశారు. 4.29 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క కార్మికునికి రోజుకు రూ.307గా వేతనం ప్రకటించింది. ఈ మేరకు వేతనం కార్మికులకు అందడం లేదు. ఈ నెలలో ఇప్పటి వరకు చెల్లించిన సగటు వేతనం రూ.282గా ఉంది. గతేడాది రూ.300 ప్రకటించగా రూ.222 నుంచి రూ.279 వరకు మాత్రమే చెల్లించారు. ప్రభుత్వం సూచించిన విధంగా కార్మికులకు వేతనం చెల్లించే విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు గుర్తించి వాటికి అంచనా వ్యయం రూపొందించే సమయంలోనే నిర్దేశించిన వేతనం కార్మికునికి చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జరుగుతున్న లోపాల వల్ల కార్మికులు కనీస వేతనం అందక నష్టపోతున్నారు. ఉపాధి హామీ పని దినాల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధిస్తోంది. 12.70 లక్షల పనిదినాలు తగ్గించడంతో వంద రోజుల పని గ్యారెంటీకి విఘాతం కలిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో ఇంత తక్కువగా పనిదినాలను తగ్గించడం ఇదే ప్రథమం. ఇది ఉపాధి హామీని నిర్వీర్యం చేసేలా ఉందని గ్రామీణాభివృద్ధి కార్మికులు ఆరోపిస్తున్నారు. మళ్లీ వలసలు వెళ్లే పరిస్థితులు వస్తాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత ఊరిని వదిలి.. పనుల కోసం వలసలు వెళ్లకుండా నిరోధించేందుకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. సొంత ఊరిలోనే పనులు కల్పించి, ఉపాధి కల్పిస్తోంది. ఇలాంటి ఉన్నతమైన పథకం ద్వారా ప్రతి ఏటా పనిదినాలు పెంచాల్సింది పోయి.. ఈ ఏడాది భారీగా ప్రభుత్వం కోత విధించింది. గత ఆర్థిక సంవ త్సరంతో పోలిస్తే ఈ ఏడాది 12.70 లక్షల పనిదినాల కోత పడిం ది. దీని వల్ల పెద్ద ఎత్తున జిల్లాలో కార్మికులు ఉపాధిని కోల్పో నున్నారు. కనీస వేతనం రూ.307గా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అంటే దాదాపు రూ.39.01 కోట్లు కార్మికులు కోల్పోనున్నారు. ఉపాధి పనిదినాల కేటాయింపులు పెంచాలని వారు కోరుతున్నారు.

లక్ష్యానికి దూరంగా పనులు

ఈ నెలలో 7,71,052 పని దినాలు లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 2,98,284 పని దినాలను కల్పించారు. 38.68 శాతం కూడా పనిదినాలు పూర్తి కాలేదు. ఇంకా ఐదు రోజుల్లో లక్ష్యం మేర పనిదినాలు కల్పించే పరిస్థితులు లేవనే చెప్పాలి. కార్మికులకు పనులు కల్పించడంలో ఉపాధి శాఖ క్షేత్ర స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనుల వ్యయం అంచనా రూపొం దించే సమయంలో ప్రతి కార్మికునికి రూ.307 వేతనం అందేలా ప్రణాళిక ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించినా ప్రయోజనం కనిపించడం లేదు. ఇందుకు నిదర్శనం కార్మికునికి వేతనం రూ.282 చెల్లించడమే. అందరికి ప్రభుత్వం ప్రకటించిన వేతనం చెల్లించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలి

- స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా 15 శాతం వృద్ధే ధ్యేయం
- అన్ని రంగాల వివరాలు సేకరించి కార్యచరణ సిద్ధం చేయాలి
- నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్రణాళికలను నిర్దేశిత లక్ష్యాలు, మార్గదర్శకాలు ప్రకారం సిద్ధం చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో విజన్ యాక్షన్ ప్రణాళికపై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ ఉద్యోగులకు(సీవీఏపీఎస్) శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా అన్ని రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించే లక్ష్యంతో రానున్న ఐదేళ్లలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. దీనికి అనుగుణం గా నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎమ్మెల్యేలను సమన్వ యం చేసుకుంటూ వీఏపీలను రూపొందించాలన్నారు. స్థానిక అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక వృద్ధి సాధించేందుకు అవకాశం ఉన్న రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై పూర్తిస్థాయి వివరాలతో కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని రంగాల వివరాలను సేకరించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వృద్ధికి అవకాశం ఉన్న రం గాల్లో నూతన ప్రాజెక్టులు ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్‌తో పాటు సక్రమంగా అవి అమలయ్యేందుకు ఉన్న అవకాశా లను కూడా తెలియజేయాలన్నారు. వీఏపీని రూపకల్పనపై ప్రణాళిక విభాగం డైరెక్టర్ రాంబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, ప్రణాళిక విభాగం సలహాదారు సీతాపతి పాల్గొన్నారు.



శిక్షణలో ప్రసంగిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నిరీక్షణకు తెర



- స్పౌజ్ కోటా పింఛన్లకు ఆమోదం
- మూడు జిల్లాల్లో 10 వేల మందికి ఛాన్స్
- 2023-2024 మధ్య మృతుల కుటుంబాలకు అవకాశం
- 30వ తేదీ లోగా దరఖాస్తు.. మే నెల నుంచి పింఛన్
- ఏళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారుల్లో హర్షం

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కొత్త పింఛన్ల మంజూరు విషయంలో తొలి విడతగా స్పౌజ్ కోటా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటికే ఈ విధానం కొనసాగుతున్నా అది 2024 అక్టోబరు తర్వాత చనిపోయిన వారికి మాత్రమే వర్తిస్తోంది. అంతకు ముందు చనిపోయిన వారికి వర్తించడం లేదు. ప్రభుత్వం తాజాగా అలాంటి వారికి కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధమైంది. తాజాగా అవకాశం కల్పించిన స్పౌజ్ కోటా పింఛన్ల దరఖాస్తులకు ప్రభుత్వం లిమిటేషన్ విధించింది. 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య చనిపోయిన పింఛనుదారు కుటుంబీకులకు మాత్రమే ప్రస్తుతం స్పౌజ్ కోటాలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ లెక్కన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 10 వేల మంది పింఛన్లకు అర్హులవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రభుత్వం నిర్దేశిత కాలంలో చనిపోయిన వారికే దరఖాస్తు అవకాశాన్ని కల్పించడంపై అర్హులై ఉండి పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అనేక మంది పెదవి విరుస్తున్నారు. 2023 డిసెంబరుకు ముందు చనిపోయినవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

నిబంధనల పేరిట గతంలో వడపోత..

గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనల పేరుతో వడపోత పోసి వేలాది మందిని అనర్హులుగా ప్రకటించింది. ఇంటిస్థలం ఎక్కువ ఉందని, 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం ఉందని, నాలుగు చక్రాల వాహనం ఉందని, ఇన్‌కమ్‌టాక్స్ చెల్లించారని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నాడని, సవాలక్ష కారణాలు చూసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు విడతలుగా 65 వేల మందిని అనర్హులుగా ప్రకటించి వారికి పింఛను ఎగ్గొట్టింది. ఈ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తూ అనేక మందికి పింఛను ఆపేసింది. గత ప్రభుత్వ హయాంలో పింఛనుదారు మరణిస్తే దాన్ని కుటుంబ సభ్యులకు వర్తింపజేయలేదు. దీంతో వారు కూడా పింఛన్ల కోసం నిరీక్షించేవారి జాబితాలోనే ఉన్నారు. ఇప్పుడు వారంతా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ విషయంలో ఆచి తూచి స్పందిస్తోంది. ప్రస్తుతం ఉన్న అనర్హులను ఏరివేస్తూ, వారి స్థానంలో అర్హులైన వారికి అవకాశం కల్పిస్తోంది. ఆ క్రమంలో తొలివిడతగా స్పౌజ్ కోటా పింఛన్లకు అవకాశం కల్పించింది.

దరఖాస్తు ఇలా..

స్పౌజ్ కోటాలో పింఛనుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హులైన లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయానికి వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలి. భార్యా భర్త ఇద్దరూ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదై ఉండాలి. ఒకే రేషన్ కార్డులో పేర్లు ఉండాలి. భర్త చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ ఉండాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ కార్డు కూడా తీసుకుని సచివాలయానికి వెళితే డిజిటల్ అసిస్టెంట్ ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేస్తారు. స్పౌజ్ కేటగిరిలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేవారు అర్హులైనప్పటికీ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఒకే ఇంట్లో లేకుండా ఉంటే వారు ఈ కోటా కింద అనర్హులు అవుతారు. వారు జనరల్ కోటాలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మోదీకి మహిళలతో స్వాగతం

- సుమారు కిలోమీటర్ పొడవునా రోడ్డు షో
- రూట్‌మ్యాప్‌ని పరిశీలించిన కలెక్టర్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃశంకుస్థాపన కార్యక్ర మంలో పాల్గొనేందుకు శుక్రవారం (మే 2) రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మహి ళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలకనున్నారు. ప్రధాని హెలికాప్టర్ ల్యాండింగ్ అయ్యే హెలిప్యాడ్ వద్ద నుంచి సుమారు కిలోమీటర్ పొడవునా సీఎం చంద్రబాబుతో కలిసి మోదీ రోడ్డు షోలో పాల్గొన నున్నారు. ఇందుకోసం ఇన్‌చార్జి బాధ్యతలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డికి ప్రభుత్వం కేటాయించింది. దీంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి ఆయన రోడ్డు షో ప్రాంతంలో పర్యటించారు. రోడ్డు షో రూట్ మ్యాప్‌ని పరిశీలించి ఆ మార్గానికి ఇరు వైపులా మహిళలను ఏ విధంగా తీసుకురా వాలనే దానిపై సమీక్షించారు. కిలోమీటర్ పొడవునా మహిళలు ప్రధానికి చేతులు ఊపుతూ... స్వాగతిస్తూ ప్లకార్డులు ప్రదర్శించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి మహిళలను సమీక రించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, ఆహార సదుపాయాలను సమకూర్చాలని తెలిపారు. అలానే ఎక్కడికక్కడ రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సీఈవో సతీష్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరి మల్లికార్జున, మెప్మా ఎండీ తేజ్‌భరత్, ఎస్పీ సతీష్‌కు మార్, జేసీ భార్గవతేజ పాల్గొన్నారు.



ప్రధాని మోదీ పాల్గొనే రోడ్డు షో రూట్‌మ్యాప్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గ్రామానికో.. మోడల్ పాఠశాల

- తరగతికి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి
- ప్రాథమిక విద్య పటిష్ఠతకు ప్రభుత్వం కసరత్తు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అస్తవ్యస్థం చేసిన ప్రాథమిక విద్యారంగాన్ని పటిష్ఠ పరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభు త్వం నిర్ణయించింది. మోడల్ పాఠశాలల ద్వారా ప్రాథమిక విద్యా రంగాన్ని బలోపేతం చేసేలా కార్యచరణ రూపొందించింది. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి బడులను చక్కదిద్దేలా విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. తక్కువ మంది విద్యార్థులు, ఎక్కువ పాఠశాలలు, తక్కువ మంది ఉపాధ్యాయుల కారణంగా ప్రాథమిక విద్య నానాటికి దిగజారిపోతుంది. చదవడం, రాయడం, లెక్కలు చేయడం వం టి ప్రాథమిక పరిజ్ఞానం కూడా విద్యార్థుల్లో లేదని పలు సర్వేలు చెబుతున్నాయి. ప్రాథమిక విద్య పునా దిసరిగా లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు చదువును అందుకోలేకపోతున్నా రని ఆయా సర్వేల్లో తేలింది. ఈ పరిస్థితులను మార్చి ప్రాథమిక విద్యలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక గది ఉండేలా మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పా టు కానున్నాయి. ప్రతి గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో ప్రాథమిక పాఠశాలల్లో 120 లేదా 90 మంది విద్యార్థులు ఉంటేనే ఐదుగురు ఉపాధ్యాయులను నియమిం చేవారు. 60 మంది విద్యార్థులు దాటిన ప్రతి ప్రాథమిక పాఠశాలను మోడల్ పాఠశాలగా ఎంపిక చేసి ఒక్కో తరగతికి ఒకరు చొప్పున ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టి న జీవో 177 రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో ఉన్న విద్యార్థులను తిరిగి ఆయా మోడల్ పాఠశాలల్లో చేర్చా లని ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా ఫలితాలలో మె రుగు అవుతాయని ఆశిస్తోంది.



మోడల్ కానున్న రామలింగేశ్వరపేట ప్రాథమిక పాఠశాల

అధికారుల్లో ప్రణాళిక లోపం...

ప్రభుత్వ లక్ష్యం ఉన్నతంగా ఉన్నా విద్యాశాఖ అధికారుల్లో ప్రణాళికా లోపం కనిపిస్తోంది. మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడంలో అధికారుల్లో సరైన ప్రణాళిక లేకుండా పోయింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. అందరికీ అందుబాటులో ఉండేలా మోడల్ ప్రాథమిక పాఠశాలలను నిర్ణయించాలి. కానీ వసతు లు పేరిట దూరంగా ఉండే పాఠశాలలను ఎంపిక చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉన్న పాఠశాలలో వసతులు లేవనే సాకుతో వాటిని ఎంపిక చేయడంలేదంటున్నారు. దగ్గర్లో ఉన్న బడిని వదిలి దూరంగా ఉండే పాఠశాలను ఏర్పాటు చేస్తే తమ పిల్లలు వెళ్లలేరంటున్నారు. ఫలితంగా ప్రభుత్వం ఆశిం చిన లక్ష్యం నెరవేరకుండా పోయేలా ఉంద ని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పటికీ ఏ గ్రామంలో, ఏ పట్టణంలో ఎన్ని మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పా టైన విషయాన్ని కూడా అధికారులు ఇంత వరకు తేల్చలేదు.

మేయర్ ఎన్నికకు.. కూటమి సిద్ధం

- పోటీ జరుగుతుందనుకునే సన్నద్ధమవుదాం
- స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లోలా సత్తా చాటుదాం
- పెమ్మసాని సోదరుడి ఆధ్వర్యంలో కార్పొరేటర్ల భేటీ

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ మేయర్ పీఠానికి ఈ నెల 28న జరిగే ఎన్నికపై టీడీపీ, జనసేన కార్పొరేటర్లతో కూటమి ముఖ్య నాయకులు గార్డెన్స్‌లోని ఓ హోటల్లో శుక్రవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఢిల్లీలో ఉండటంతో ఆయన సోదరుడు పెమ్మసాని రవిశంకర్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, ఎండీ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర(నాని), ఏపీఐడీసీ చైర్మన్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, జనసేన నేతలు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వరరావులు టీడీపీ, జనసేన కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. మేయర్ ఎన్నికకు సంబంధించి నేతలు చర్చించారు. ఎన్నికకు వెళదామా, వద్దా అనే అంశంపై వైసీపీ తర్జన భర్జన పడుతున్న విషయం తెలిసిందే. అయినా ఎన్నిక జరుగుతుందనే భావించి సన్నద్ధమవుదామని కార్పొరేటర్లకు కూటమి ముఖ్య నేతలు సూచించారు. కూటమి తరపున మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర(నాని)ని ఇప్పటికే నేతలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28న జరిగే ఎన్నిక వ్యూహంపై నేతలు సమావేశంలో చర్చించారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో అన్ని స్థానాలను కూటమి చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా ఎన్నిక జరిగినా మేయర్ పీఠాన్ని కూటమి పరం చేయాలని ముఖ్య నేతలు కార్పొరేటర్లకు సూచించారు.



మిర్చియార్డుకు వేసవి సెలవులు

● 9వ తేదీ వరకే కొనసాగనున్న ట్రేడింగ్



గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)కి మే 12వ తేదీ నుంచి వేసవి సెలవులు రానున్నాయి. ఏటా మే నెల మొదటి వారం తర్వాత యార్డులో పని చేసే పరిస్థితులుండవు. ఒకపక్క ఎండ తీవ్రత, మరోవైపు మిర్చికోరుతో వ్యాపారస్థులు, ఉద్యోగులు, ముఠా కార్మికులు అనారోగ్యం భారిన పడుతుంటారు. దీనిని పరిగణనలోకి తీసుకొని మిర్చి దిగుమతి, ఎగుమతి వ్యాపారస్థులు, కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు సెలవులు ప్రకటిస్తారు. ఆ విధంగా మే 12వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించాల్సిందిగా ఆయా సంఘాలు జీఏంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికకి విజ్ఞప్తి చేశాయి. దీనిపై మార్కెటింగ్ శాఖ లాంఛనంగా ఆమోద ముద్ర వేస్తుంది. కాగా మే 9వ తేదీ శుక్రవారం వరకే యార్డులో ట్రేడింగ్ జరుగుతుంది. 10, 11 తేదీలు శని, ఆదివారంలు యార్డుకు సాదారణ సెలవుదినాలు, తిరిగి జూన్ 8వ తేదీన యార్డులో మిర్చి లావాదేవీలు పునఃప్రారంభమౌతాయి.

ప్రమాదవశాత్తు గుండ్లకమ్మలో పడి బాలిక మృతి

నూజెండ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గుండ్లకమ్మ నదిలో పడి బా లిక మృతి చెందిన సంఘటన శుక్రవారం పాత ఉప్పలపాడు సమీపంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చీకటి విజయ రాజు కృపావరంల కుమార్తె చీకటి కీర్తి హెరోనిక(11) మధ్యాహ్నం సమయంలో ఇంట్లో వాడుకోనేం దుకు నీటి కోసం సమీపంలోని గుండ్లకమ్మ నదికి వెళ్ళి ప్రమాద వశాత్తు నీటిలో పడి మరణించింది. పది సంవత్సరాల క్రితం పెద్ద కుమారుడు ఇమ్మానియేలు కూడా గుండ్లకమ్మలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఏపీ ఫైబర్ సేవల్లో తీవ్ర అంతరాయాలు

తరచూ నిలిచిపోతున్న ప్రసారాలు- నానా ఇబ్బందులు పడుతున్న కేబుల్ ఆపరేటర్లు

వేమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా వ్యాప్తంగా తరచు ఏపి ఫైబర్ ప్రసారాలు నిలిచిపోతున్నాయి. దీంతో కేబుల్ ఆపరేటర్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నియమించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇటీవల ఏపి ఫైబర్ సంస్థ తొలగించింది. బాపట్ల జిల్లాలో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది విధుల నుండి తప్పుకున్నారు. గత నెల రోజుల నుండి ఏపి ఫైబర్ ప్రసారాల్లో తరచూ అంతరాయం కల్గుతుంది. ప్రసారాల అంతరాయంపై మాట్లాడేందుకు ప్రస్తుతం ఉన్న అధికారులు స్పందించడం లేదు. గత ప్రభుత్వం ఏపి ఫైబర్ నెట్ వర్కుపై శ్రద్ధ చూపని కారణంగా కేబుల్ ప్రసారాలు చేసే వైర్లు ఎక్కడ పడితే అక్కడ కిందకు వేలాడుతూ తెగిపోతున్నాయి. వైర్లు తెగి ప్రసారాలు ఆగిపోతే పునరుద్ధరించేవారు లేరు. దీంతో జిల్లా కేంద్రం బాపట్లతో పాటు రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లోనూ అంతరాయం సమస్యతో పలు మండలాల ఆపరేటర్లు వినియోగదారులకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. గత నెల రోజుల నుండి ఆపరేటర్లు ప్రైవేట్ టెక్నీషియన్ల ద్వారా తెగిన వైర్లను సరి చేయించుకుంటున్నారు. ప్రసారాల్లో నాణ్యత, తరచూ అంతరాయాల కారణంగా వినియోగదారులు నెలవారీ నగదును ఇవ్వడం లేదని ఆపరేటర్లు వాపోతున్నారు. కాని ఇక్కడ నెలవారి నగదును మాత్రం ఏపిఫైబర్ కేబుల్ ఆపరేటర్ల నుండి ముందుగానే తీసుకుంటుంది. పైగా యాక్టివ్‌లో లేని ఏపీ ఫైబర్ సెటప్ బాక్సులకు అద్దె రూపంలో ప్రతి నెలా రూ.60లు వ్యాలెట్‌లో కోత విధిస్తున్నారు. అంతే కాకుండా ప్రస్తుతం ఉన్న వినియోగదారులు అంతరాయాల కారణంగా వేరే నెట్ వర్కులకు మారిపోతున్నారు. దీంతో వినియోగదారులు సంఖ్య తగ్గిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆపరేటర్లు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు కేబుల్ ఆపరేటర్ల తమ స్వంత ఖర్చులతో ఏపి ఫైబర్ నెట్ కనెక్షన్లు అందించారు. ఆయా కనెక్షన్లు అందించినందుకు గాను కొంత శాతం నగదును ఆపరేటర్లకు చెల్లిస్తామని గత ప్రభుత్వం చెప్పింది. కాని గత ప్రభుత్వం పైసా కూడా తమకు చెల్లించలేదని ఆపరేటర్ల చెబుతున్నారు. కరోనా సమయం నుంచి ఐటి ఉద్యోగులు ఇప్పటికి పలుచోట్ల వర్క్ ఫ్రం హోమ్ కొనసాగిస్తున్నారు. వారి కోసం కరోనా సమయంలో ఏపిఎస్ఎఫ్ఎల్ సంస్థ నెట్ కనెక్షన్లు కేబుల్ ఆపరేటర్ల ద్వారా అందించింది. ప్రస్తుతం జరుగుతున్న అంతరాయాల కారణంగా ఐటి ఉద్యోగులు తమ వర్క్‌ను పూర్తి చేయలేక ఈ నెట్‌వర్క్‌తో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆపరేటర్లను నిందిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మానస పుత్రిక అయిన ఏపి ఫైబర్ పరిస్థితి ఇలాగే కొనసాగితే అతి తక్కువ కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆపరేటర్లు చెబుతున్నారు. అవినీతి జరిగిందని ప్రభుత్వం ఏపి ఫైబర్ సంస్థలో కూలంకషంగా సోదాలు చేస్తున్నట్లు వినికిడి. అయితే జిల్లా స్థాయిలో ఉన్న అధికారులను కూడా విచారించడంతో పాటు, క్షేత్ర స్థాయిలో విచారణ జరిపితే ఇక్కడ ఉన్న దొంగలు కూడా బయటకు వస్తారని ఆపరేటర్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మరో వైపు తొలగించిన సిబ్బంది స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని తక్షణ నియామకాలు చేపట్టకపోవడంతో ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రసారాల్లో నిరంతర అంతరాయాలతో వినియోగదారులు, ఆపరేటర్లు పడుతున్న ఇబ్బందులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే తాత్కాలిక నియామకాలను చేపట్టి తమను రక్షించాలని కేబుల్ ఆపరేటర్లు కోరుతున్నారు. లేనిపక్షంలో ఏపీఎస్ఎఫ్ఎల్‌ను నమ్ముకుని తాము వెచ్చించిన లక్షలాది రూపాయలు నష్టపోతామని ఆపరేటర్లు ఆవేదన చెందుతున్నారు.

హోరాహోరీగా ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

జూనియర్ విభాగం విజేతలుగా బాపట్ల, తెలంగాణ ఎడ్ల జతలు



మొదటి బహుమతిని కైవసం చేసుకున్న ఎడ్లు

వినుకొండటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా కొనసాగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జూనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో పలు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లు, తెలంగాణకు చెందిన రోహన్‌బాబు ఎడ్లు 3,750 అడు గులు బండ లాగి మొదటి స్థానంలో సమానంగా నిలిచాయి. పోటీల్లో రెండు జతలు మొదటి స్థానంలో నిలబడటంతో మొదటి, రెండో బహుమతిని కలిపి ఇద్దరికీ సమానంగా ప్రదానం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి బుర్రముక్క కౌశల్యారెడ్డికి చెందిన ఎడ్లు 3,508 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. గుంటూరుకు చెందిన సోమిశెట్టి అంజనేయులు ఎడ్లు 3,507 అడుగులు లాగి 4వ స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట ఖాజీపురానికి చెందిన వేగినాటి ఓసురారెడ్డి, బండి సాహిత్‌శ్రీభవన్ ఎడ్లు 3,250 అడుగులు లాగి 5వ స్థానం, గుంటూరు రూరల్ మండలం లింగాయపాలేనికి చెందిన యలం సాంబశివరావు ఎడ్లు 3వేలు అడుగులు లాగి 6వ స్థానం, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నాదెండ్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్ ఎడ్లు 2,910 అడుగులు లాగి 7వ స్థానం, ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం బొప్పూడివారిపాలేనికి చెందిన చిట్టిపోతు రామాంజనేయులు ఎడ్లు 2,518 అడుగులు లాగి 8వ స్థానం, నల్గొండ జిల్లా నిడమానూరు మండలం సూరేపల్లికి చెందిన ఎస్.అనంతరాములుకు చెందిన ఎడ్లు 2,251 అడుగులు లాగి 9వ స్థానంలో నిలిచాయి. వినుకొండ 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి మొదటి బహుమతి రూ. 80వేలు, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ ముప్పాళ్ల జ్ఞానేశ్వరావు రూ.70వేలు, గీతాంజలి పాఠశాల అధినేత ఎండ్లూరి శేషగిరిరావు రూ.60వేలు, పోకా అనంతబాబు, అజయ్‌బాబు, కామని శ్రీనివాసరావు రూ.50 వేలు, వినుకొండ పట్టణంలోని జయతి హాస్పిటల్ యజమాని డాక్టర్ కాకాని వెంకట సురేంద్ర రూ.40 వేలు, కంచర్ల రాంబాబు, కిరణ్‌బాబు, ఆదిబాబు రూ.30 వేలు, వంకాయలపాటి పేరయ్య రూ.20 వేలు, గురిజాల ఆదినారాయణ రూ.15 వేలు, ఆర్‌ఎంపీ డాక్టర్స్ సంఘం అధ్యక్షుడు పాశం నాగమల్లేశ్వరరావు రూ.10వేలు నగదు విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఉదయం నుంచి సీనియర్ విభాగానికి చెందిన 12 జతల ఎడ్లు.పోటీల్లో నువ్వా నేనా అన్నట్లుగా తలపడుతున్నాయి. పోటీలను తిలకించేందుకు వచ్చిన వారిని కట్టడి చేయడం పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. పోటీల సందర్భంగా మదమంచిపాటి స్వామి దేవాలయం ఆవరణలో మక్కెన చినరామయ్య పేరుతో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఈ నెల 18 నుంచి అన్నదానం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. పోటీలను తిలకించేందుకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని పోటీలను ఆసక్తిగా తిలకించి ఎడ్ల యజమానులను అభినందించారు.కార్యక్రమంలో నిర్వాహకులు మక్కెన వెంకట్రావు, అనుమోలు సుబ్బారెడ్డి, మాదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గారెడ్డి, అక్కిరెడ్డి, గురువారెడ్డి, కుంటా కోటిరెడ్డి, తిప్పిరెడ్డి, అంజిరెడ్డి, చప్పిడి రామారావు, పోకా సుబ్బారావు, నాగులపాటి గుర్నాథం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అధిక రక్తపోటు నియంత్రణతో పక్షవాతం నుంచి రక్షణ

● ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు విజయ



కరపత్రాలను విడుదల చేస్తున్న విజయ, రమణ, సుందరాచారీ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏటా 18 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారని, వీరిలో 25 శా తం మంది 40 ఏళ్లలోపు వయస్సు వారేనని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో 'చెక్ బీపీ స్టాప్ స్ట్రోక్' క్యాంపెయిన్‌లో భాగంగా రోగులకు, వారి సహాయకులు బీపీ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ విజయ రోగులను ఉద్దేశించి మాట్లాడారు. బీపీని ముందుగానే తెలుసుకొని మందులు, ఆహార నియమాలతో నియంత్రిస్తే 80 శాతం వరకు పక్షవాతం సోకకుండా నివారించవచ్చన్నారు. అందువల్ల 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా బీపీ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఒకవేళ బీపీ ఉంటే డాక్టర్ల సలహా మేరకు తగిన మందులు వాడుతూ బీపీని నియంత్రణలో ఉంచుకోవాలని డాక్టర్ విజయ సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెడెంట్ డాక్టర్ ఎస్ ఎస్‌వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీపీ చెకప్‌కు సంబంధించిన కరపత్రాలను డాక్టర్ విజయ, డాక్టర్ సుందరాచారీ, డాక్టర్ రమణ తదితరులు విడుదల చేశారు. అనంతరం ఐఎస్ఏ ఆధ్వర్యంలో నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, న్యాయవాదుల సంఘం, హోల్ సేల్ మందుల దుకాణ వ్యాపారుల సంఘం, మలినేని ఇంజనీరింగ్‌కాలేజీ, ప్రజావేదిక తదితర ప్రాంతాల్లో ఉచిత బీపీ వైద్యపరీక్ష శిబిరాలను నిర్వహించారు.

స్పందన లేని.. ఫీజు ఆఫ్ కాల్

● సీజీఆర్‌ఎఫ్‌కు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదు
● చైర్మన్, రిటైర్డ్ జడ్జీ విక్టర్ ఇమ్మానుయేల్

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): లో వోల్టేజ్ సమస్యలపై ఫిర్యాదు చేసినా.. ఫీజు ఆఫ్ కాల్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదంటూ విద్యుత్ వినియోగదారులు సీజీఆర్ఎఫ్((కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ ఫోరం)కు ఫిర్యాదులు చేశారు. గుంటూరు టౌన్-1 డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ నేతృత్వంలో శుక్రవారం స్థానిక సంగడిగుంటలోని విద్యుత్‌భవన్‌లో అదాలత్ జరిగింది.



వినియోగదారుడు నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఇమ్మానుయేల్, సభ్యులు

మొత్తం 15 సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు చేయగా అక్కడికక్కమే పది సమస్యలను పరిష్కరించినట్లు చైర్మన్ తెలిపారు. కొత్తపేటలో ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫారం, నాయుడుపేట ప్రాంతంలో లోవోల్టేజ్, ఆంజనేయపేట నివాసాలపై హెచ్‌టీ లైన్లు తదితర ఫిర్యాదులను చైర్మన్ స్వీకరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో మొత్తం 10 లోపే ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినియోగదారులు అవసరమైతే సమస్యలపై గుణదలలోని సీజీఆర్ఎఫ్ కార్యాలయంలో, 9491034319 నెంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. తమకు వచ్చిన ఫిర్యాదులను గరిష్ఠంగా రెండు నెలలలోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ ఆర్థిక, టెక్నికల్ సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, సర్కిల్ ఎస్ఏవో పాశం రామిరెడ్డి, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు తదితరులు ఉన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గుంటూరు కేంద్ర గ్రంథాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేష్ సహకారంతో త్వరలో పరిష్కరిస్తామన్నారు. గ్రంథాలయ ఉద్యోగులకు త్వరలో పూర్తిస్థాయి గ్రాంట్ సాధిస్తానని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న, ప్రమోషన్లు, ఉద్యోగాలు భర్తీ .. మొదలగు అనేక సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని తెలియజేశారు. అలాగే ఉద్యోగులు అందరూ సక్రమంగా పనిచేస్తూ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కార్యదర్శులు సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, అధ్యక్షులు తిరుమలశెట్టి నరసింహారావు, పెన్షనర్ సంఘం అధ్యక్షులు మల్లేశ్వరరావు, త్రిమూర్తులు గ్రంథాలయ సంస్థల ఉద్యోగులు, పెన్షన్ దారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు, హాజరైన ఉద్యోగులు ,పెన్షనర్లు

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

తెనాలి రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు చేసుకున్న ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఆనంద్ కథనం ప్రకారం మండలంలోని గుడివాడకు చెందిన కామంచి ఆమని (34) కొంతకాలంగా గ్రామంలోని ఓ కోళ్లఫారంలో రోజువారి కూలీగా పనిచేస్తున్నది. గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ ఆమె వెంట పడుతూ ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు గురిచేసేవాడు. దానితో ఆగక పదే పదే ఫోన్ చేస్తూ అసభ్యంగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేసేవాడు. దీనిపై ఆమె పనిచేసే కోళ్ల ఫారం యజమాని దృష్టికి తీసుకురాగా మహేష్‌ను పిలిపించి మందలించాడు. దీంతో కొన్ని రోజులు పాటు వేధింపులు ఆపిన మహేష్, ఈ నెల 4న సాయంత్ర సమయంలో కోళ్లఫారంలో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఆమె వెంటపడటంతో విషయాన్ని భర్తకు చెప్పింది. దీంతో మహేష్‌ను మందలించేందుకు ఇంటికి వెళ్లితే అతడి తల్లి, కుమారుడు కలిసి మూడు సంవత్సరాలుగా ఇద్దరి మధ్య అక్రమ సంబంధం కొనసాగుతుందంటూ చెప్పి ఇదే విషయాన్ని గ్రామస్తులందరికీ ప్రచారం చేయడంతో వివాహిత మనస్థాపానికి గురైంది. దీంతో ఈ నెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. అక్కడ పోలీసులు ఆమె వాంగ్మూలం తీసుకోగా మహేష్, ఆమె తల్లి రమాదేవి చేసిన అసత్య ప్రచారాన్ని తట్టుకోలేకే ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు చెప్పింది. ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఇరువురిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగిన నిందితుడు

వివాహిత ఆమని ఆత్మహత్య కేసులో ఏ-1గా ఉన్న నిందితుడు మహేష్ శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉదయం కేసులో ముద్దాయిలను విచారణకు తీసుకురాగా పోలీసుల కళ్లుకప్పి ఇంటికి వెళ్లి గడ్డి మందు తాగినట్లు సమాచారం. గమనించిన బంధువులు అతడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం పొన్నూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్


ఎమ్మెల్యే జూలకంటి సమక్షంలో చేరిక



కౌన్సిలర్ సుభానిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పురపాలక సంఘానికి చెందిన 29వ వార్డు వైసీపీ కౌన్సిలర్ షేక్ సుభానిసాహెబ్ మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కౌన్సిలర్ సుభానికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పట్టణాభివృద్ధి కోసం పాటుపడడం తమకు నచ్చిందని అం దుకే టీడీపీలో చేరినట్లు కౌన్సిలర్ సుభాని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి పాల్గొన్నారు.

రైలు దోపిడి నిందితులు అరెస్ట్




నిందితుల వివరాలను తెలుపుతున్న జీఆర్‌పీ ఎస్ఐ వెంకటాద్రి తదితరులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులపై కర్రలతో దాడి చేసి వారి సెల్‌ఫోన్‌లను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు జీఆర్‌పీ ఎస్సై వెం కటాద్రి తెలిపారు. ఈనెల 21న కాకినాడ తిరుపతి ట్రైన్‌లో ప్రయానిస్తున్న మాచర్ల సంతోష్‌కుమార్‌పై నిడుబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో కర్రతో దాడి చేసి సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. తన సెల్ ఫోన్ కు కాల్ చేయగా రూ. 20 వేలు ఇవ్వాలని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో దాడికి పాల్పడింది నిడుబ్రోలుకు చెందిన దేవర సాయి, యర్రంశెట్టి వంశీలను గుర్తించి అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టులో ప్రవేశపెట్టగా ఇద్దరు నిందితులకు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు. నిందితులు వినియోగించిన ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామన్నారు.

ప్రధాని భేటీలో సీఎంతో కలిసి పాల్గొన్న జిల్లా ఎంపీలు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించేందుకు సీఎం చంద్రబాబుతో కలిసి జిల్లా ఎంపీలు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు పాల్గొనే అవకాశం లభించింది.



గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

పింఛన్ల పంపిణీలో అవినీతికి తావుండరాదు

● కలెక్టర్ నాగలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావుండరాదని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో పింఛన్ల పంపిణీ సిబ్బందికి శుక్రవారం ఆమె కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ నివేదిక ఆధారంగా ఈ ఏడాది ఏప్రిల్ వరకు నాలుగు నెలల్లో జరిగిన పింఛన్ పంపిణీలో అవినీతి/ప్రవర్తనకు సంబంధించి పెన్షనర్లు అసంతృప్తి వ్యక్తం చేసిన సిబ్బందిని ఉద్దేశించి ప్రవర్తన మార్చుకోవాలన్నారు. పెన్షనర్ల ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ చేయాలన్నారు. ఆ సమయంలో వాళ్లతో మర్యాదపూర్వకంగా, గౌరవంగా మాట్లాడాలన్నారు. ఎలాంటి అవినీతికి పాల్పడరాదని స్పష్టం చేశారు. ఎవరైతే కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదో వాళ్లందరికి మెమోలు జారీ చేయాలని డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మిని ఆదేశించారు. ఇకపై పింఛన్ సిబ్బంది అందరూ జాగ్రత్తగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పాకిస్థానీయులకి ఆశ్రయం ఇస్తే చర్యలు

● 27లోగా దేశం విడిచి వెళ్ళాలని ఎస్పీ ఆదేశాలు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్ర ఘటన, భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో పాకిస్థానీయుల జాడ కోసం నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. అయితే జిల్లాలో అధికారికంగా ఒక్కరు కూడా లేరని తేలింది. అయినా ఎవరైనా అక్రమంగా ఉన్నట్లయితే ఈ నెల 27లోగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా అనధికారికంగా ఉన్నారేమోననే కోణంలోనూ స్పెషల్ బ్రాంచ్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. తక్షణ వీసాలు, వ్యాపారం, సినిమా, జర్నలిజం, రవాణా, సమావేశాలు, పర్వతారోహణ, విద్యార్థి, సందర్శన(విజిటర్స్), బృంద పర్యటనలు(గ్రూప్ టూరిస్ట్), యాత్రిక(పిలిగ్రిమ్స్), పాకిస్తాన్ దేశీ యాత్రిక బృంద వీసాలు వంటి వాటిపై ఎవరైనా జిల్లాలో ఉంటే తక్షణం దేశం విడిచి వెళ్ళాలని ఎస్పీ ఆదేశించారు. పాకిస్తాన్ వీసాలతో ఎవరైనా అక్రమంగా నివసిస్తుంటే అట్టివారిపైనా, అటువంటి వారికి ఆశ్రయం ఇచ్చిన వారిపైనా చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాదర్బార్‌తో ప్రజలకు మరింత చేరువయ్యాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ప్రజాదర్బార్ ద్వారా కలిగిందని, తనకు దక్కిన అదృష్టంగా దాన్ని భావిస్తున్నానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలో శుక్రవారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని, పెద్ద ఇల్లు ఉందని, ఏవేవో కుంటిసాకులు చెప్పి పింఛన్లు, రేషన్ కార్డులకు ఎగనామం పెట్టారని, దీంతో ప్రజాదర్బార్‌లో ఎక్కువ శాతం పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచిందని చెప్పారు.


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, దేగల ప్రభాకర్, సజీల

గుంటూరు ఈస్ట్ రోల్ మోడల్‌ను చేస్తా

గుంటూరులోని ఆరో డివిజన్ రైలుపేటలో రూ. 36 లక్షల విలువ చేసే సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారం చేపట్టాక గుంటూరు నగరం రోల్ మోడల్‌గా మారుతోందని తెలిపారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోనే 50 శాతానికిపైగా రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టామని, మిగిలిన వాటిని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్, ఇన్‌చార్జి మేయర్ సజీల, కార్పొరేటర్ పోతుల సమత, డివిజన్ అధ్యక్షుడు జీజ, పోతురాజు చంద్ర, బాజీ మాస్టర్, గంట కిరణ్, ఫిరోజ్, సుభాని, వంగర ఏడుకొండలు, మస్తాన్‌రెడ్డి, ఏసమ్మ, బాబు, వలి, పార్థసారథి, కొత్తూరు వెంకట్, ఆళ్ల నాని, రాంబాబు, పద్మావతి, పోతురాజు చంద్ర, కొనకళ్ళ సత్యం, వేదాంతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలీసెట్ మెటీరియల్ పంపిణీ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ రాసే విద్యార్థినీ, విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు గోనుగుంట్ల వెంకట్ ఆధ్వర్యంలో 350 మంది విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఆర్ఐ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిడి తిలక్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేసేందుకు రోటరీ క్లబ్ ముందుకు రావడం హర్షణీయమని, ఇంకా ఎవరికైనా మెటీరియల్ కావాలంటే 95020 54168కు వాట్సప్‌లో సంప్రదించాలని సూచించారు. ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో చదివి 591 మార్కులు సాధించిన సాయి రఘురామ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అచీవర్స్ క్లబ్ అధ్యక్షుడు నల్లూరి సాంబశివరావు, కార్యదర్శి విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మెటీరియల్ పంపిణీ చేస్తున్న గోనుగుంట్ల వెంకట్, పిడికిడి తిలక్ బాబు తదితరులు

గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు తప్పనిసరిగా నిర్దేశిత గడువు మేరకు పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం కొరిటెపాడు, పెద్దపలకలూరు రోడ్డు, ఉద్యోగ నగర్, జేకేసీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను తనిఖీ చేసి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల వారీగా ఎమినిటి కార్యదర్శులు తాగునీటి సరఫరా సమయాల్లో శ్యాంపిల్స్ సేకరించాలని, కలుషిత నీటి సరఫరా గుర్తిస్తే తక్షణం తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాస్, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఎన్టీఆర్ స్టేడియంలో 1 నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్

జీఎంసీ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్ జరుగుతుందని, క్యాంప్‌లో పాల్గొనే ఆసక్తి కలిగిన 14 ఏళ్లలోపు బాలబాలికలు స్టేడియం, స్విమ్మింగ్ పూల్‌లలో శనివారం నుంచి దరఖాస్తులు పూర్తి చేసి ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు సమ్మర్ కోచింగ్ క్యాంప్ జరుగుతుందన్నారు. క్యాంప్‌లో అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, స్కేటింగ్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, ధ్యానం, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్ అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. నెల రోజుల శిక్షణ అనంతరం జరిగే క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తామని తెలిపారు.

గుంటూరు ఛానల్ పనులను ప్రారంభించాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఛానల్ పనులను తక్షణమే ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘ నాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మికి, ఇరిగేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఛానల్‌కు బడ్జెట్‌లో రూ.100 కోట్ల నిధులను మంజూరు చేసి, విడుదల చేసినట్టు సామాజిక మాధ్యమాలు ద్వారా తెలిసిందన్నారు. తక్షణమే ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు భూ సేకరణ, ఇతర పనులను ప్రారంభించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో లావు అంకమ్మ చౌదరి, మన్నవ హరిప్రసాదు తదితరులు ఉన్నారు.

దోమకాటు నివారణ ద్వారా మలేరియా నుంచి రక్షణ

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దోమకాటు నివారణ ద్వారా మలేరియా, డెంగీ, చికున్ గన్యా తదితర ఐదు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. మలేరియా జ్వర నివారణకు తమ వంతు కృషి చేస్తామని ఆరోగ్య సిబ్బంది చేత ఆమె ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ దోమల సంతతి నివారణకు ప్రతి శుక్రవారాన్ని ప్రజలు డ్రైడేగా పాటించాలని కోరారు. అనంతరం ఆరోగ్య శాఖ నుంచి ప్రారంభమైన మలేరియా అవగాహన ర్యాలీ నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు వెళ్లి తిరిగి కార్యాలయానికి చేరింది. కార్యక్రమంలో డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్, సుబ్బరాయన్, మలేరియా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


ఆరోగ్య సిబ్బందితో ప్రమాణం చేయిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

శ్రీనివాసరావుతోట యూపీహెచ్‌సీలో..

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమవుతుందని సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రశాంత్ తెలిపారు. జాతీయ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీనివాసరావుతోట యూపీహెచ్‌సీలో మలేరియా నివారణ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కెయస్ సుకుమార్, ఎస్‌పీఎస్ సూరి, యస్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

హయ్యర్ పెన్షన్ దరఖాస్తుల తిరస్కరణలు ఆపాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దాదాపు 7 లక్షల 50 వేల హయ్యర్ పెన్షన్ దరఖాస్తులను తిరస్కరణ చేసిందని, తక్షణమే ఇటువంటి చర్యలు ఆపాలని ఏపీ ఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.గంగాధరరావు అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కృష్ణనగర్, పీఎఫ్ కార్యాలయం ఎదుట, పెన్షన్‌దారులు చేపట్టిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. దేశంలో 17 లక్షల మంది పెన్షన్ దరఖాస్తు చేసుకోగా ఇప్పటికి 830 మందికి మాత్రమే పెన్షన్ చెల్లింపులు ఇస్తున్నారని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అధిక శాతం ఆర్టీసీ ఉద్యోగులేనని చెప్పారు. 2022లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనుసరించి అందరికి హయ్యర్ పెన్షన్ చెల్లించాలన్నారు. అనంతరం పీఎఫ్ కమిషనర్‌కు వివిధ డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. నిరసనలో యూనియన్ నాయకులు దశరథ రామిరెడ్డి, బాబు ప్రసాదు, కే.కోటేశ్వరరావు, హరిప్రసాదు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బహుళ క్రమశిక్షణ కమిటీ నివేదికని నిలిపేయాలి

● దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డిమాండ్

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో రన్నింగ్ సిబ్బందిపై బహుళ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదికని ఎట్టి పరిస్థితుల్లో అమలు చేయరాదని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ గుంటూరు డివిజనల్ సెక్రెటరీ వీవీ రమణయ్య కోరారు. శుక్రవారం ఎన్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పిలుపు మేరకు రన్నింగ్ సిబ్బంది కంబైన్డ్ క్రూ లాబీల వద్ద ధర్నా నిర్వహించారు. సెక్రెటరీ రమణయ్య మాట్లాడుతూ రన్నింగ్ స్టాఫ్ డ్యూటీకి హాజరైనప్పటి నుంచి దిగిపోయే వరకు కనీసం కాలకృత్యాలు కూడా తీర్చుకోకూడదని నివేదికలో పొందుపరచడం దారుణమన్నారు. అలానే పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ సెక్రెటరీ వీ కిరణ్‌కుమార్, ఇతర నాయకులు కృష్ణమోహన్, మూర్తి, శ్రీధరాచారి, డీ నాగరాజు పాల్గొన్నారు.

ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణలో...

బాధితుడికి నరకం చూపిస్తున్న కార్పొరేషన్, ఏపీసీపీడీసీఎల్

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణలో ఆ బాధితుడు 115 చదరపు గజాల భూమిని కోల్పోయాడు. దానికి నగరపాలకసంస్థ ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదు. అదేమంటే మీరు ప్లాన్ తీసుకొనేటప్పుడు మాకు రోడ్డు విస్తరణ కోసం భూమిని గిఫ్టు డీడ్ చేశారని చెబుతూ తిరస్కరిస్తున్నారు. గిఫ్టు డీడ్ చేసిన ఇతర భవన యజమానులకు మాత్రం నష్టపరిహారం చెల్లించారు. దీంతో అతను న్యాయం కోసం కోర్టు తలుపులు తట్టారు. కాగా ఇప్పుడు విద్యుత్ శాఖ వచ్చి మీ షాపు ముందు 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ని ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ఆ బాధితుడు తీవ్ర మనోవేదన చెందుతున్నాడు. గురువారం ఏపీసీపీడీసీఎల్, కార్పొరేషన్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు.

ఉత్తమ నర్సింగ్ సేవల అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సుల దినోత్సవమైన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించు కొని ఈ ఏడాది నుంచి ఆంధ్రప్రదేశ్ నర్సింగ్, మిడ్ వైఫరీ కౌన్సిల్ (ఏపీ ఎన్ఎంసీ) ఉత్తమ నర్సింగ్ సేవలకు అవార్డులు అందజేయనుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో గత ఆరు దశాబ్దాల్లో మొట్టమొదటిసారిగా నర్సింగ్ సేవలకు సంబంధించి ఉత్తమ నర్సింగ్ సేవలకు అవార్డులు అందజేయాలని ఏపీ ఎన్ఎంసీ నిర్ణయించింది. అర్హులైన నర్సులు తమ దరఖాస్తులను ఏప్రిల్ 30వ తేదీలోపు పోస్టు, కొరియర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నర్సింగ్, మిడ్‌వైఫరీ కౌన్సిల్‌కు అందేలా పంపుకోవాలని ఏపీ ఎన్ఎంసీ రిజిస్ట్రార్ శుక్రవారం తెలిపారు. మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను ప్రదానం చేస్తారు.

మే 14 నుంచి వేసవి శిక్షణ తరగతులు

గుంటూరు విద్య ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ కళాశాలలో ఉచిత వేసవి శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు జూపూడి రంగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పోస్టర్స్ ఆవిష్కరించారు. హిందూ బంధువులకు భగవద్గీత, మార్షల్ ఆర్ట్స్, స్వీట్స్ ఫాస్ట్ ఫుడ్, కర్ణాటక శాస్త్రీయ సంగీతం, మగ్గం వర్క్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణ మే 14 నుంచి జూన్ 7 వరకు నిర్వహిస్తారని, ఈ ఉచిత శిక్షణ తరగతులకు సంబంధించిన అప్లికేషన్లు బ్రాడీపేట 3/10లోని ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయంలో లభిస్తాయని, మరిన్ని వివరాలకు ఆర్గనైజర్ గాయత్రి బెహరా 9949148006కు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏఈఎల్సీ వివాదానికి ఎట్టకేలకు హైకోర్టు చెక్

● ప్రస్తుత కమిటీలన్నీ రద్దు.. త్వరలో ఎన్నికలు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏఈఎల్సీలో నెలకొన్న వివాదానికి ఎట్టకేలకు హైకోర్టు చెక్ పెట్టింది. ప్రస్తుత కమిటీలను రద్దుచేసి ఆ స్థానంలో ఎన్నిక కోసం విశ్రాంత జడ్జీలను నియమించింది. కోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం ఏఈఎల్సీ అధ్యక్షుడిగా, మోడరేట్ బిషప్‌గా పర దేశిబాబు కొనసాగుతున్నారు. ఆయనకు మరో నెల రోజులు గడువు ఉంది. గడిచిన కొన్నేళ్లుగా ఏఈఎల్సీ పరిధిలోని 6 సెనెడ్‌లతోపాటు అధ్యక్షుడి పదవి వ్యవహారం వివాదస్పదంగా మారింది. ఇరు వర్గాలు హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో హైకోర్టు నూతనంగా కమిటీలకు ఎన్నికలు నిర్వహించాల్సిందిగా ఆదేశిస్తూ విశ్రాంత జడ్జిలను నియమించింది. ఈ క్రమంలో ఏఈఎల్సీ కంప్ట్రోలర్‌గా సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ కురియన్ జోసెఫ్ (కేరళ), అడ్మినిస్ట్రేటర్‌గా విశ్రాంత జడ్జి జోసఫ్ (కేరళ)ను నియమించింది. అదేవిధంగా కంప్ట్రోలర్ కురియన్ జోసఫ్‌కు సెక్రటరీగా విశ్రాంత జడ్జి జేసురత్నకుమార్‌ను నియమించింది. ఈమేరకు ఈ ముగ్గురు విశ్రాంత జడ్జిలు శుక్రవారం నగరంలోని ఏఈఎల్సీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈఎల్సీలోని రెండు గ్రూపులకు సంబంధించిన ప్రతినిధులు వారిని కలిసి తమ వాదన వినిపించారు.

డాక్టర్ రమణ సేవలకు ప్రభుత్వ గుర్తింపు అభినందనీయం

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవపరంగా డాక్టర్ ఓవీ రమణ అందిస్తున్న సేవలకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునివ్వటం అభినందనీయమని ఏపీ రాష్ట్ర హోమియో వైద్యులు అభినందించారు. గుంటూరులో శుక్రవారం జరిగిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియో పాథిక్ ఫిజీషియన్స్ స్టేట్ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో కళారత్న అవార్డు గ్రహీత డాక్టర్ ఓవీ రమణను ఘనంగా సత్కరించారు. పలువురు హోమియో వైద్య నిపుణులు మాట్లాడుతూ ఉగాది పురస్కారాల భాగంగా డాక్టర్ రమణకు కళ రత్న అవార్డు అందజేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సన్మానించబడటం హోమియో వైద్యులందరికీ గర్వకారణం అన్నారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రభుత్వం కళారత్న అవార్డు ప్రదానం చేయటం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హోమియో వైద్యులు డాక్టర్ డి నరేంద్రనాథ్, ఆంజనేయులు, కోదండరామిరెడ్డి, నరసింహారావు, ముకుంద ప్రియ, మధు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ ఓవీ రమణ ను సత్కరిస్తున్న రాష్ట్ర హోమియో వైద్యులు

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుతం అనుభవిస్తున్న తీవ్ర పని ఒత్తిడి, ప్రమోషన్స్, పంచాయతీల రీగ్రూపింగ్ (గ్రేడ్స్ కుదింపు) తదితర సమస్యలపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు శుక్రవారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, ప్రధాన కార్యదర్శి బందెల రమేష్, కార్యవర్గ సభ్యులు కొశెట్టి నాగరాజు, అశోక్ కుమార్, నాగరాజు, శ్రీనివాస్, మల్లిఖార్జున, లెనిన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ పోటీలకు విజ్ఞాన్ నిరుల విద్యార్థిని ఎంపిక

గుంటూరు (విద్య) ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 2, 3, 4 తేదీల్లో జరిగే 12వ అంతర్‌రాష్ట్ర మహిళల, పురుషుల బీచ్ కబడ్డీ పోటీలకు విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థిని షేక్ షాజహాన్ బీ ఎంపికైనట్లు చెప్పారు. కళాశాల అధ్యక్ష ఉపాధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, లావు శ్రీకృష్ణదేవరాయలు, బీఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి డాక్టర్ టీవీఎన్ ప్రసన్న, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ కిషోర్ కుమార్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.హరీష్ తదితరులు అభినందనలు తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న డాక్టర్ పాతూరి రాధికా తదితరులు

కీళ్ళవాతం, కండరాల నొప్పులపై రేపు ఆరోగ్యసభ

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరుగుతోన్న కీళ్ళవాతం, కండరాల నొప్పులపై అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఆరోగ్యసభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రుమటాలజిస్టు డాక్టర్ మురళీకృష్ణ హాజరై అవగాహన కల్పిస్తారన్నారు.

నృత్య కదంబం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై జరుగుతున్న మహా మంజీర నాదం-2025 శుక్రవారం నాటి కి మూడో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు ప్రారంభించగా, సభకు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన నృత్య ప్రదర్శనలలో స్వాతి ఆత్మనాథన్ (వారణాసి) భరతనాట్యాన్ని, హర్షిత ఎస్‌వీఆర్(హోన్నవర్, కర్ణాటక) కన్నడ యక్షగాన, సంపూర్ణ రాజ్యలక్ష్మి కూచిపూడి నృత్యం ప్రేక్షకులను రసానందంలో ఓలలాడించాయి. కళాకారులను సంస్థ కార్యదర్శి డాక్టర్ ఖాజ వెంకట సుబ్రహ్మణ్యం యువ కళారత్న పురస్కారంతో ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం పండరీపురం, బ్రాడీపేటలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మిర్చి యార్డు, అంకిరెడ్డిపాలెం, ఆదర్శనగర్, మహర్షి దయానందనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య పేర్కొన్నారు.



కాగడాలతో ప్రదర్శన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, కోవెలమూడి రవీంద్ర, పెమ్మసాని రవి, సజీల

ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తాం

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

● ఉగ్రవాద చర్యలు నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తుపాకుల మోతలతో భారతావనిని భయపెట్టలేరని, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాద దాడిని నిరసిస్తూ ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి హిమనీ సెంటర్ వరకు కాగడాలతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెమ్మసాని రవి, కోవెలమూడి నాని, ఇన్‌చార్జి మేయర్ సజీల పాల్గొన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కాశ్మీర్ వంటి పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదులు మారణకాండను ప్రపంచం మొత్తం ఖండిస్తోందని తెలిపారు. ఇది కేవలం పిరికిపంద చర్య అని ఆయన దుయ్యబట్టారు. మతతత్వ ఉగ్రవాదాన్ని ఎన్నటికీ సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాద వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు భారతదేశం నడుం కట్టిందని, ఉగ్రవాదుల చర్యలకు దీటుగా బదులిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలి... శాంతి పరిడవిల్లాలి అంటూ నేతలు నినాదాలు చేశారు. కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల ర్యాలీ

గుంటూరు(తూర్పు) ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ మృతులకు సంతాపం తెలుపుతూ శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగులు ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బ్రాడీపేట, యూనియన్ బ్యాంకు ఎదుట జరిగిన కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం నాయకులు బాషా మాట్లాడారు. కార్యక్రమంలో కిషోర్, రామకృష్ణ, రవిచంద్రరెడ్డి, మురళీ, షరీఫ్ వేణు, పావని, విజయక్రాంతి పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో..

ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా నిర్మూలించే దిశగా కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ఉగ్రదాడిని నిరసిస్తూ తూర్పు నియోజకవర్గం నేత ఆనంద్ సాగర్ ఆధ్వర్యంలో హిమనీ సెంటర్లో వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. నగర ఉపాధ్యక్షుడు చింతా రాజు, చామర్తి ఆనంద్ సాగర్ మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యలకు కేంద్ర ప్రభుత్వం ఖచ్చితంగా ప్రతిచర్య తీసుకుంటుందన్నారు. నగర కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, వీరమహిళలు, డివిజన్ అధ్యక్షులు, జనసైనికులు పాల్గొన్నారు

స్వరరాగ సుధా ఆధ్వర్యంలో..

ఉగ్రదాడిలో గాయపడిన వారికి, మృతుల కుటుంబాలకు సంఘీభావంగా స్థానిక సంపత్‌నగర్‌లో స్వర రాగ సుధా గుంటూరు వారిచే భక్తి సంకీర్తన కార్యక్రమం జరిగింది. ప్రముఖ గాయకుడు కె.వి సాయిబాబా శర్మ బృందం ఆధ్వర్యంలో పలు కీర్తనలను ఆలపించారు. అనంతరం చనిపోయిన వారికి ఆత్మ శాంతించాలని కోరుతూ ఐదు నిమిషాలు మౌనం పాటించారు.

ఆర్‌వీఆర్ అండ్ జేసీలో కొవ్వొత్తుల ర్యాలీ

గుంటూరు (విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం లో ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం చోడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత దేశాన్నే కాకుండా యావత్ ప్రపంచ దేశాల ప్రజలను సైతం కలచివేసిన తీవ్ర విషాద ఘటన అని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. దాడికి నిరసనగా ర్యాలీ చేపట్టినట్లు ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తదితరులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ విభాగాల కో-ఆర్డినేటర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సీపీఎం ఆధ్వర్యంలో...

కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు, నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అన్నారు. బ్రాడీపేటలో ఆ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పర్యాటకులకు భద్రత కల్పించకపోవడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో వీవీకే సురేష్, షేక్ అబ్దుల్ సలీం, జి వెంకటరావు, ఎ కళ్యాణి, షేక్ బాషా, ఖాశిం వలి పాల్గొన్నారు.


యూటీఎఫ్ నివాళి

గుంటూరు (విద్య) ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ అన్నారు. పహల్గాం ఉగ్ర దాడిని ఖండిస్తూ శుక్రవారం కార్యాలయం నుంచి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉగ్రవాదం ముక్త కంఠంతో ఖండించాలని అందరం ఐక్యంగా శాంతిని కాపాడుకోవాలి అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జీ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జీ.వెంకటేశ్వరరావు, ఎం గోవిందు, ఎండీ షకీలా బేగం ఆడిట్ కమిటీ సభ్యులు ఏం కోటిరెడ్డి కే ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అమరావతిరోడ్డులోని వేలంగిని నగర్ 8 వ లైను కి చెందిన దొడ్డా గోపి అనే రియల్ వేస్టేట్ వ్యాపారి అదృశ్యమయ్యారు. ఆయన ఈనెల 17న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయలుదేరి వెళ్ళి ఇంతవరకూ తిరిగి ఇంటికి రాలేదు. ఆయన భార్య మరియరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

..ఆ చెట్టు నీడన



భానుడు భగభగ మండినా..చల్లని ప్రేమను మానుకోలేదు


చల్లని పల్లెగాలి.. నీడనిచ్చే ఈ చెట్ల వద్దకు రాగానే.. కాసేపు సేద తీరాలి అనే కోరిక కలుగుతుంది. గ్రామాలు, పట్టణాల్లోని కొన్ని చెట్లు చరిత్ర పుటల్లో నిలిచి.. ఆయా ప్రాంతాలకు ప్రత్యేక ఆనందాన్ని ఇస్తున్నాయి. వాటిలో ఒక్కో చెట్టుకు ఒక్కో చరిత్ర. వాటి స్థితిగతులను బట్టి దశాబ్దాలుగా వాటిని ప్రత్యేక పేర్లతో పిలుస్తున్నారు. మన పూర్వికులు నాటిన మొక్కలే నేడు మానులైన గ్రామ, పట్టణ చరిత్రలో పేరుగాంచాయి.

- మండు వేసవిలో చల్లటి నీడనిస్తున్న వృక్షాలు
- ఒక్కో చెట్టుకు ఒక్కో చరిత్ర.. వాటి పేరు మీదే సెంటర్ల ఏర్పాటు
- సేద తీరేందుకు, రచ్చబండకు, చిరు వ్యాపారాలకు అవే వేదికలు

చెట్టు పేరుమీదే సెంటర్లు

పెదకూరపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదకూరపాడు మహాలక్ష్మమ్మ చెట్టు సెంటర్, జెండా చెట్టు సెంటర్లు ఫేమస్. ఈ రెండు సెంటర్లలో ఉన్న అరుగులపై ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు కూర్చుని ముచ్చట్లు పెట్టుకుంటారు. గారపాడు గ్రామంలోని జెండా చెట్టు సెంటర్ కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చెట్ల వద్ద ఆయా గ్రామాల ప్రజలు ఎండలకు సేద తీరుతారు.

అందమైన అనుబంధం



చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల నుండి వేటపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో బ్రహ్మంగారి చెట్టు ఉంది. ఇక్కడ ఈ ఆలయం వెలసి సుమారు 300 ఏళ్లు కాగా, సుమారు 80 సంవత్సరాల క్రితం స్థానికులు ఆలయానికి ఆనుకుని ఓ రాగి మొక్కను నాటారు. అనంతరం మహా వృక్షంగా బ్రహ్మంగారి చెట్టు అని పిలిచేలా రూపాంతరం చెందింది. అలాగే పేరాల ముత్యాలమ్మ పేటలో వేంచేసియున్న మహాలక్ష్మమ్మ చెట్టు సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పడింది. స్థానికులు, ప్రయాణికులు ఈ చెట్టు నీడలో సేద తీరుతున్నారు.

బాటసారులు సేదతీరే జమ్మిచెట్టు



కొల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ జమ్మి చెట్టు వద్ద పూర్వకాలం నుంచి బాటసారులు సేద తీరుతున్నారు. కొల్లూరు నడిబొడ్డులో అనంత భోగేశ్వర స్వామి, పార్వతీ అమ్మవార్ల దేవస్థానాల ఆధ్వర్యంలో జమ్మి చెట్టును నాటారు. అప్పటి నుండి బాటసారులకు ఆ చెట్టు నీడ కల్పిస్తోంది. దాతలు బాటసారులు కూర్చునేందుకు చెట్టు చుట్టూ పెద్ద అరుగు నిర్మాణం చేశారు. దసరా ఉత్సవాల్లో పార్వతీ అమ్మవారికి జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

వందల ఏళ్లుగా నీడనిస్తూ..



దాచేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల నుంచి గ్రామస్తులకు నీడనిస్తున్న.. ఈ రావి చెట్టును చూస్తే గ్రామస్తులకు ఎన్నో మధుర జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. అప్పటి గ్రామ పెద్దలుగా ఉన్న కరణం, మునుసుబులు ఈ చెట్టు నీడన కూర్చొని గ్రామస్తుల చిన్న చిన్న తగాదాలను, వివాదాలను పరిష్కరించేవారు. కేసానుపల్లిలోని రావి చెట్టు అంటే ఆ గ్రామస్తులకు ఎంతో మక్కువ. చెట్టు నీడలో గ్రామస్తులు విశ్రాంతి తీసుకుంటారు.

ప్రత్యేక గుర్తింపు



అద్దంకి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో రెండు ప్రాంతాలకు ఆ చెట్ల పేర్లుతోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకటి హిందువులు భక్తిశ్రద్ధలతో కొలిచే మహాలక్ష్మమ్మ చెట్టు కాగా, మరొకటి ముస్లింలు పవిత్రంగా భావించే జెండా చెట్టు కావడం విశేషం. అద్దంకి పట్టణంలోని గుంజివారిపాలెంలో తరతరాల క్రితం మహాలక్ష్మమ్మ చెట్టు ఉంది. దశాబ్ద కాలం క్రితం చెట్టు ఉన్న ప్రాంతంలోనే మహాలక్ష్మమ్మ విగ్రహం ఏర్పాటు చేసి మహాలక్ష్మమ్మ దేవాలయం నిర్మించారు. ఇక భవాని సెంటర్ సమీపంలో ఉన్న దూదేకులపాలెంలో ఉన్న వేప చెట్టు.. జెండా చెట్టుగా గుర్తింపు పొందింది. సుమారు శతాబ్ద కంటే ముందు నుండే జెండా చెట్టు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

బాపట్ల నడిబొడ్డున మహాలక్ష్మీఅమ్మవారి చెట్టు



బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల చరిత్రకు చిహ్నమైన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయానికి సమీపంలో నాలుగు రోడ్ల కూడలిలో శతాబ్దకాలానికి పైగా వెలిసిన శ్రీమహాలక్ష్మీ అమ్మవారి చెట్టు భక్తుల కోర్కెలు తీరుస్తోంది. నాలుగు దేవాలయాలకు మధ్యలో నాలుగు రోడ్ల కూడలి వద్ద మహాలక్ష్మీ అమ్మవారి చెట్టు ప్రసిద్ధిగాంచింది. నూతన వధూవరులు ఇక్కడకు వచ్చి పూజలు చేస్తారు. బాపట్ల గడియార స్తంభం దగ్గర ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ చెట్టు దగ్గర నిత్యం వందలాది మంది వలస కూలీలు పనుల కోసం వచ్చి చెట్టు నీడన నిలబడి సేద తీరుతారు. కూలీలు కావాల్సిన వారు ఈ చెట్టు దగ్గరకొచ్చి మాట్లాడుకొని తీసుకెళ్తారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ఈ చెట్టు నీడన ఉండి పర్యవేక్షిస్తుంటారు.

చిలకలూరిపేటలో మహా వృక్షాలు



చిలకలూరిపేట ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేటలో వందల సంవత్సరాల చరిత్ర ఉన్న మహా వృక్షాలు పలు చోట్ల ఉన్నాయి. స్థానిక గడియార స్తంభం వద్ద నుంచి ఓగేరు వాగుకువెళ్లే బ్రహ్మంగారి గుడి రోడ్డులో వందల సంవత్సరాల నాటి రాగి, మర్రి, వేప చెట్లు ఉన్నాయి. ఈ చెట్ల వద్దకు వెళ్లి పూజలు చేసే ఆనవాయితీ దశాబ్దాల తరబడి కొనసాగుతోంది. 300 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ మహావృక్షం 2022 లో మోడుబారిపోయింది. దీంతో స్థానికులు కడియం నుంచి మూడు సంవత్సరాల వయస్సు ఉన్న వేప చెట్టును మూడేళ్ల క్రితం తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నాటారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని కూడా ఆ చెట్టు వద్ద ఏర్పాటు చేశారు. చీరాల రోడ్డు లోనే 200 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న వెంకటేశ్వర స్వామి చెట్టు (చింత చెట్టు) కూడా ఉంది. ఈ చెట్టు వద్ద శంకు చక్ర నామాలు ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. పండరీపురంలో ఆరవ లైన్ లో ఉన్న వేప చెట్టు కూడా ఎంతో ప్రాముఖ్యత కలిగీ ఉంది. ఇక్కడ పెళ్లిళ్ల సమయంలో దేవుడుకు ఎదురు నడిచే ఆనవాయితీ ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతున్నది.

మండు వేసవిలో అక్కున చేర్చుకుంటూ...



రేపల్లె, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికి అల్లాడిపోయే ప్రజలను.. చల్లటి గాలి వీస్తూ.. తన నీడలో అక్కును చేర్చుకుంటుంది ఈ చెట్టు. దీని చరిత్ర ఆరు దశాబ్దాలకు పైమాటే.. రేపల్లె పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో ఉన్న ఈ వృక్షాన్ని అంకమ్మ చెట్టుగా పిలుస్తారు. ఏటా పాతపట్నంలోని ప్రజలు ఈ చెట్టుకు కొలుపులు కొలుస్తూ సద్ది నైవేద్యాలు సమర్పిస్తూ దేవతా మూర్తిగా కొలుస్తారు. ప్రయాణికులు అంకమ్మ చెట్టు నీడలో సేద తీరుతుంటారు. పాత పట్నం వాసులు సాయంత్రం 4 నుండి 7గంటల వరకు ఈ చెట్టు నీడనే వివిధ రకాల సమావేశాలు నిర్వహించుకుంటూ ఉంటారు. మండలంలోని పేటేరు గ్రామంలో సీతామహలక్ష్మీ చెట్టు పేరొందింది. పలువురికి నీడనిస్తూ రచ్చబండగా మారింది. ఈ వృక్షం వయస్సు.. సుమారు 60 ఏళ్ల పైమాటే.. ఐదేళ్ల క్రితం ఈదురుగాలులకు పెద్దకొమ్మలు విరిగిపోయాయని.. లేకుంటే ఇంకా నీడగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.



ఐదు దశాబ్దాలకు పైగా ఆదరణ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తెనాలి నాజరుపేటలోని మహలక్ష్మమ్మ చెట్టు సెంటర్. ఐదు దశాబ్దాలకు పైగా ఈ కూడలి జనాదరణ పొందింది. ఆ ప్రాంతంలోని వారంతా ఉదయం, సాయంత్రం అక్కడ చేరి ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ గడిపేవారు. పూర్వీకులు ముఖ్యమైన ప్రాంతాల్లో చెట్లు నాటి ఆలయాన్ని నిర్మించి అక్కడ చేరి మాట్లాడుకునేవారు. కాలం మారిపోవడంతో నాటి ప్రాముఖ్యత ప్రస్తుతం తగ్గిపోయింది. ఆ ప్రాంతాలను చూసిన వృద్ధులకు ఇప్పటికీ నాటి ఊసులు గుర్తు చేసుకుంటూ.. ఆనందంతో చెప్పుకుంటారు.

తరాల నాటి వేపచెట్టు



పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో తరాల నాటి వేపచెట్టు ప్రయాణికులకు, ప్రజలకు సేద తీర్చేందుకు నిలయంగా మారింది. మండుటెండలో విలవిల్లాడుతున్న వారు ఈ వేపచెట్టు నీడ కిందుకు చేరుకొని సేద తీరుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు.. రద్దీగా ఉండే బొమ్మల సెంటర్ కూడలిలో కనీసం ఒక్క బస్సు షెల్టర్‌కూడా లేకపోవడంతో ఈ వేప చెట్టు కిందనే వేచి ఉండి ఆయా మార్గాలకు ప్రయాణిస్తున్నారు. చిరువ్యాపారులు కూడా ఇదే చెట్టును ఆవాసంగా చేసుకొని వ్యాపారాలు సాగిస్తుంటారు.

- పర్చూరు, ఆంధ్రజ్యోతి

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో..

● కీబోర్డు వాయిద్యంలో పలువురికి చోటు

మాచవరం, రేపనల్లె, తుళ్లూరు ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో మాచవరం మండలం మోర్జంపాడు గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలుగా విధులు నిర్వహిస్తున్న గారపాటి మణిదీప్తి చోటు సంపాదించింది. డిసెంబరు 1, 2024లో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విజయవాడ వ్యవస్థాపకులు ఫాస్టర్ అగస్టీన్ దండిగి ఆధ్వర్యంలో సంగీత వాయిద్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 18 దేశాల నుంచి 1,100 మంది సంగీత కళాకారులు పాల్గొని ఆన్‌లైన్‌లో గంట పాటు సరళి స్వరాలను కీ బోర్డుపై ఆలపించి ఆ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసి ఈ ఘనత సాధించినట్టు మణిదీప్తి తెలిపారు. 1,100 మంది పాల్గొనగా 1,046 మంది ఈ రికార్డుకు ఎంపికైనట్టు తెలియ జేశారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఫాస్టర్ దిండిగి చేతుల మీదుగా మణిదీప్తి ఈ అవార్డును అందుకున్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న మణిదీప్తి



సర్టిఫికెట్ అందుకుంటున్న అమూల్య

ఆలా అమూల్య...

రేపల్లె పట్టణంలోని 5వ వార్డుకు చెందిన చిన్నారి ఆలా అమూల్య మ్యూజికల్ కీబోర్డు ఇన్‌స్ట్రుమెంట్‌లో ప్రతిభ కనబరిచి గిన్నీస్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. పట్టణానికి చెందిన ఆలామోషే, లావణ్య వారాల రెండో కుమార్తె ఆలా ఆమూల్య. నేతాజీ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో విద్యను అభ్యసిస్తోంది.



సర్టిఫికెట్ అందుకుంటున్న సంవేద్ బాబు

సంవేద్ బాబు..

తూళ్లూరు మండలంలోని రాజధాని గ్రామం బోరుపాలెం బుడ్డోడు సంవేద్‌బాబు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం లభించింది. 50 సెకన్ల వ్యవధిలో సరళి స్వరాలను స్పష్టంగా అత్యంత వేగంగా పలికించినందుకు గాను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. సంవేద్ బాబుకి మెడల్, సరిఫికెట్ ప్రదానం చేశారు. గతంలో ఇంజినీయెస్ వరల్డ్ రికార్డులో సంవేద్ బాబు స్థానం సంపాదించాడు. గత ఎన్నికల్లో తాడికొండ నియోజకవర్గం నుంచి టీడీపీ తరుపున ఎమ్మెల్యే టికెట్ ఆశించిన తోకల రాజవర్ధన్ కుమారుడే సంవేద్‌బాబు. 8వ తరగతి చదవుతున్నాడు.

ఉత్సాహంగా కేంద్రీయ విద్యాలయం బాలికల కబడ్డీ పోటీలు



సర్టిఫికెట్లతో బాలికల కబడ్డీ జట్టు

గుంటూరు (విద్య)ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నల్లపాడు లోని కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ఎస్.విజయ్ కుమార్, హెచ్ఎం ఎస్.ఆనంద్, పీఈటీ అంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తిరుపతి షిఫ్ట్- 1 ప్రథమ బహుమతి తిరుపతి షిఫ్ట్ 2 ద్వితీయ బహుమతి, గుంటూరు షిఫ్ట్ 1 జట్టు ప్రత్యేక బహుమతులు అందుకున్నాయి. సర్టిఫికెట్లు పతకాలు అందజేశారు.

పత్రికా పఠనం వల్లే సివిల్స్‌పై ఆసక్తి

తల్లిదండ్రులతో సివిల్స్ విజేత చల్లా పవన్ కల్యాణ్



యూపీఎస్సీ 146 ర్యాంకర్ చల్లా పవన్ కల్యాణ్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'చిన్నప్పటి నుంచి నాన్న (చల్లా రమేష్) ప్రభావం నా మీద ఎక్కువగా ఉండేది. పేపర్లు చదవడం కూడా అలానే అలవాటు అయ్యింది. పత్రికా పఠనం వల్లే పొలిటికల్ సైన్స్‌పై ఆసక్తి పెరిగి సివిల్స్ వైపు వెళ్లేలా చేసింది. సాఫ్ట్వేర్ ఉద్యోగం క్యాంపస్‌లోనే వచ్చింది. ఆ ఉద్యోగం చేస్తే.. నేను స్థిరపడతాను. కానీ, ప్రజలకు సేవ చేయాలని చిన్నప్పటి నుంచి కన్న కలలు నిజం కావు. అందుకోసమే ఆ ఉద్యోగం వద్దని సివిల్స్ కోసం కష్టపడ్డాను.' అని యూపీఎస్సీ 146 ర్యాంకర్ చల్లా పవన్ కల్యాణ్ అంటున్నారు. సివిల్స్ ఫలితాలు వెలువడిన తర్వాత ఆయన 'ఆంధ్రజ్యోతి' తో ప్రత్యేకంగా మాట్లాడారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన పవన్ ప్రాథమిక విద్యను గుంటూరులోనే పూర్తిచేశారు.

వెంకటేశ్వర బాలకుటీర్‌లో క్రమశిక్షణ..

గుంటూరులోని వేంకటేశ్వర బాలకుటీర్‌లోనే పదో తరగతి వరకు చదివాను. అక్కడ క్రమశిక్షణ.. దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు మనసులో చెరిగిపోని ముద్ర వేశాయి. తిరుచ్చిలో బీటెక్ పూర్తి చేస్తున్న సమయంలో అమెరికా బేస్ ఉన్న సంస్థలో సాఫ్ట్వేర్ ఉద్యోగం వచ్చింది. కానీ, ఆ ఉద్యోగంలో చేరడం నాకు ఇష్టం లేదు.

ముచ్చటగా మూడోసారి

ప్రజలకు సేవ చేయాలంటే కచ్చితంగా సివిల్ సర్వీస్‌కు వెళ్లాల్సిందేనని నిర్ణయించుకున్నాను. 2020 నుంచి సిద్ధమవుతున్నాను. మొదటి ప్రయత్నంలోనే ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాను. రెండవ ప్రయత్నంలో మెయిన్స్ క్లియర్ చేశారు. కానీ, ఇంటర్వ్యూ పోయింది. మూడోవ ప్రయత్నంలో 146 ర్యాంకు వచ్చింది.

స్మార్ట్ వర్క్ తప్పనిసరి

సివిల్స్‌లో విజయం సాధించాలంటే హార్డ్ వర్క్‌తో పాటు.. స్మార్ట్ వర్క్ కూడా ఖచ్చితంగా తెలిసి ఉండాలి. ఏది ఎంత వరకు చదవాలో.. అంత వరకే చదవాలి. ఏది ఎప్పుడు చదవాలో అప్పుడే చదవాలి. నేను కూడా ఇదే పద్ధతిని అవలంబించాను. పరీక్షలు దూరంగా ఉన్నప్పుడు రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు చదివే వాడిని. పరీక్షలు దగ్గరికి వచ్చే కొలదీ రోజుకు 7 నుండి 10 గంటల వరకు చదివే వాడిని. కొంతమంది సీనియర్లు సలహాలు సూచనలు కూడా తీసుకొని ముందుకు వెళ్లాను. ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కలిసి.. కొన్ని సూచనలు, మెళకువలు నేర్చుకుని నా ప్రయత్నానికి మెరుగులు దిద్దుకున్నాను.

చివరి ప్రశ్న మరిచిపోలేనిది

ఇంటర్వ్యూలో నన్ను అడిగిన చివరి ప్రశ్న ఎప్పటికీ మరచిపోను. నాకు భౌగోళిక చిత్రాలను గుర్తించడం అలవాటు అని దరఖాస్తులో పేర్కొన్నాను. అంటే ఏదైనా ఒక ప్రాంతానికి చెందిన ఫొటోను చూసి.. అది ఏ ప్రాంతమో గుర్తించడం అన్న మాట. ఇంటర్వ్యూలో నాకు ఒక ఫొటో చూపించి ఇది ఎక్కడిదో చెప్పమన్నారు. అది కొచ్చి లోనిది కాబట్టి అదే సమాధానం చెప్పా. ఇంటర్వ్యూ చేసే వాళ్లు కూడా ఆ సమాధానం విని కొంత ఆశ్చర్యానికి లోనయ్యారు.

పత్రికల పఠనంతో విషయ పరిజ్ఞానం

అందరికీ వెంటనే విజయం వరిస్తుందని చెప్పలేం. ఒకటికి రెండు సార్లు సివిల్స్ ప్రయత్నించే వాళ్లు.. ఏదో ఒక ఉద్యోగం చేస్తూ పరీక్షలకు హాజరు కావడం మంచిది. దానివల్ల తల్లిదండ్రులపై పెద్దగా భారం పడకుండా ఉంటుంది. పత్రికలు చదవడం వల్ల కూడా చాలా విషయ పరిజ్ఞానం పెరుగుతుంది.

ప్రజలకు వీలైనంత సేవ చేస్తా

ఏ లక్ష్యంతో అయితే సివిల్స్‌కి వెళ్లాలని అనుకున్నానో అదే లక్ష్యంతో ముందుకు వెళ్తాను. చిన్నప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పరిస్థితి పూర్తిగా చూశాను కాబట్టి ప్రజలకు ఎంతవరకు సేవ చేసే అవకాశం ఉంటే అంత వరకు సేవ చేస్తాను.


సీఐటీయూ క్రికెట్ టోర్నీ ప్రారంభం

- మేడే సాంస్కృతిక, క్రీడా వారోత్సవాలను జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

పెదకాకాని, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మే డే సందర్భంగా ఉద్యోగ, కార్మికుల క్రీడా సాంస్కృతి వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సీఐటీయూ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఐటీయూ రాష్ట్రవ్యాప్తంగా మే డే సందర్భంగా క్రీడా సాంస్కృతి వారోత్సవాలు నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మే 20న జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 8 గంటల పని విధానం, సమ్మె డిమాండ్లను ప్రచారం చేయడం కోసం మే డే వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ నిర్వహిస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, దండా లక్ష్మీనారాయణ, గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, యూనివర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు కె.రూఫస్ పాల్గొన్నారు. మొదటి రోజు జరిగిన మ్యాచ్‌లో గుంటూరు మిర్చి కింగ్స్‌పై రాజు ఏఎన్యూ టీం విజయం సాధించింది. రెండవ మ్యాచ్ జీఎంసీ వారియర్స్ వర్సెస్ సీఆర్‌డీఏ సర్కిల్ ఎలక్ట్రిసిటీ మధ్య జరిగింది.

సమాజ శ్రేయస్సుకే మానవ మేధస్సు

● విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ జి.కొండలరావు



డాక్టర్ జి.కొండలరావుకు సన్మానం

పెదకాకాని, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మానవ మేధస్సును సమాజ శ్రేయస్సుకే వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ దూరదర్శన్ వార్తా పూర్వ విభాగాధిపతి డాక్టర్ జి.కొండలరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్, జర్నలిజం విభాగాల ఆధ్వర్యంలో గుంటూర యునెస్కో క్లబ్ సమన్వయంతో 'సాంకేతిక యుగంలో విద్యార్థుల బాధ్యత' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి కొండలరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు అధ్యాపకుల సలహాలు, సూచనలతో తమ భవిష్యత్తును ఉత్తమమైన జీవన విధానంగా మలుచుకోవాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యఅతిథి ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు తమ కాలం నాటి విద్యా వ్యవస్థ, నేటితరం విద్యా విధానాల మధ్య వ్యత్యాసాలను వివరించారు. గౌరవ అతిథి, వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, సదస్సు సంచాలకులు కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య రామినేని శివరామప్రసాద్, పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి పాల్గొన్నారు. డాక్టర్ జి.కొండలరావును ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, అతిథులు, యునెస్కో గ్రూప్ గుంటూరు క్లబ్ నిర్వాహకులు పరమేశ్వరరావు సన్మానించారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

698 బస్తాల పసుపు అమ్మకం

దుగ్గిరాల, ఏప్రిల్ 25: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 698 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,200, గరిష్ఠ ధర రూ.12,250, మోడల్‌ధర రూ.11,750 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,200, గరిష్ఠ ధర రూ.12,250, మోడల్‌ధర రూ.11,750 పలికాయి.

ఆత్మకూరులో కుట్టుమిషన్లు పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న పోతినేని శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ బేవరేజస్ కోకాకోలా సంస్థ సౌజన్యంతో టీడీపీ ఆధ్వర్యంలో ఆత్మకూరు గ్రామానికి చెందిన పలువురు మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు శుక్రవారం టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు టీ.వెంకటరావు, మండల ఉపాధ్యక్షుడు కొమ్మా సుకుమార్, జ్యోతి, కే.వెంకట కుమార్, కృష్ణ ప్రభావతి, బి.అరుణ, టీ.తిరుపతమ్మ, కోకాకోలా సంస్థ ప్రతినిధులు శివారెడ్డి, వినయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకు 1316 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణాపశ్చిమడెల్టాకు 1316 క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటిమట్టం ఉంది. తూర్పుకాల్వకు 95, పశ్చిమకాల్వకు 44, నిజాంపట్నం కాల్వకు 130, కొమ్మమూరుకాల్వకు 577క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

143వ రోజుకు చేరుకున్న దీక్షలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని, బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారంతో 143వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఏ విజయశ్రీ, కాశమ్మ, దుర్గాభవాని, చరిత్ర, శ్రీదివ్య, సారమ్మ, మల్లేశ్వరి కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నేత కూరపాటి స్టీవెన్, ఆశీర్వాదం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్‌రావు, అంకయ్య, హగ్గయ్య, మాణిక్యారావు, నాగేశ్వరరావు, శివకుమారి, ఇజ్రాయేలు, గురవయ్య, ఎస్ దేవరాజ్, సీహెచ్ చిన్నపున్నారావు, వై రమాదేవి, ఎం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఈఈ కొండయ్య, ఏఈఈ అంజయ్ కుమార్ తదితరులు

ఫిరంగిపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల సెక్రటేరియట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటుచేశారు. చలివేంద్రాన్ని పంచాయతీరాజ్ డీఈఈ కొండయ్య, జేఈఈ అజయ్ కుమార్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడుతాయని డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో రవిబాబు అన్నారు. సచివాలయ డిస్ట్రిక్ట్ అసోసియేట్ ప్రెసిడెంట్ షేక్ గస్‌సైదా, మండల ప్రెసిడెంట్ పవన్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి సత్కారం

తుళ్లూరు(వెలగపూడి), ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో చంద్రబాబు ఇల్లు కట్టుకోవటానికి స్థలం విక్రయించిన రైతు కుటుంబం కంచర్ల సాంబశివరావు, శాంతకుమారి దంపతులను రైతు నేతలు శుక్రవారం వెలగపూడిలోని గృహంలో రైతు నేతలు సత్కరించారు. కార్యక్రమంలో రైతు నేతలు జొన్నలగడ్డ శంకర్, జొన్నలగడ్డ నాగమల్లేశ్వరావు, కంచర్ల జన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

27న ఉచిత వైద్యశిబిరం

పెదనందిపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పలపాడు సత్యసాయి కల్యాణ మండపంలో ఈనెల 27న అరవపల్లి వీరరాఘవయ్య జ్ఞాపకార్థం ధర్మపత్ని సత్యవతి, కుమారుడు రాంబాబు సహకారంతో రోటరీ క్లబ్ పెదనందిపాడు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్ శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చేవారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లతో రావాలని తెలిపారు. ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడాదిన్నరైనా పింఛన్ రావడంలేదు..

దుగ్గిరాల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భర్త మృతి చెంది ఏడాదిన్నరైనా పింఛన్ అందలేదని మాజీసర్పంచ్ పెరవలి పుష్పాలు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ తుదిశ్వాసవరకూ పార్టీకి అండగా నిలిచారామె భర్త. 2023 నవంబరులో పెరవలి రాములు మృతి చెందగా పింఛన్ కోసం ఆయన భార్య పుష్పాలు ఎదురుచూస్తోంది. అయితే ఇప్పటి వరకు ఆమెకు పింఛన్ అందలేదు. పలుమార్లు సచివాలయం చుట్టూ తిరిగినా అన్ని అర్హతలు ఉన్నా ఫలితం లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఎంపీడీవోను కలిసి పింఛన్ ఇప్పించాలని వినతిపత్రం అందించానన్నారు. అయితే 2023 డిసెంబరు1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య భర్తను కోల్పోయిన వారు కొత్త వితంతు పింఛన్లకు అర్హులని ప్రభుత్వం జీవో జారీ చేసిందని తన లాంటి వారి పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నిస్తున్నారు.

ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న మంచికలపూడి మాజీసర్పంచ్ పెరవలి పుష్పాలు



పరిశుభ్రత జీవన విధానం కావాలి



అవగాహనా ర్యాలీలో పాల్గొన్న ఎంటీఎంసీ అధికారులు, కూటమి నాయకులు

మంగళగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా చెప్పారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంటీఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరు అండర్ పాస్ నుంచి వడ్డెరపాలెం వరకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై ప్రజలందరూ చైతన్యవంతం కావాలన్నారు. అనంతరం పార్కు రోడ్డు వద్ద ఈ-వ్యర్థాల సేకరణ కోసం కియోస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, అడిషనల్ కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, కూటమి నాయకులు గోసాల రావ, పంచుమర్తి చిన్నా, తుల్లిమిల్లి రామకృష్ణ, మునగాల నాగేశ్వరరావు, కొమ్మా సుకుమార్, తాటి వెంకటరావు, శానం మాణిక్యాలరావు, కట్టా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహనా ర్యాలీ



కుంచనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

మంగళగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గణపతి నగర్‌లోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష ప్రారంభించారు. మలేరియా లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది సైదులు, వాసు తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో..

తాడేపల్లి(కుంచనపల్లి), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కుంచనపల్లి యూపీహెచ్‌సీ, తాడేపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మలేరియా వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ ర్యాలీ జరిగింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కుంచనపల్లిలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మలేరియా వ్యాధి దోమకాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని ప్రతి శుక్రవారం డ్రైడే డ్రైడేగా పాటించాలని, నిల్వ నీరు లేకుండా చూడాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమతెరలు వాడాలని ప్రజలకు తెలిపారు. డ్రైవర్స్ కాలనీలో ర్యాలీ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో డాక్టర్ శాంతికుమారి, డాక్టర్ మానస, డాక్టర్ నాగేంద్రబాబు, సీహెచ్‌వో గురుకుమార్, సుధీర్‌కుమార్, శివశంకర్, శ్రీనివాసరావు, ఉమాదేవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మంగళగిరిలో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, మలేరియా సిబ్బంది

దుగ్గిరాలలో...

దుగ్గిరాల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ జరిగింది. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమకాటు బారిన పడకుండా ఉండేందుకు పాత టైర్లు, ఖాళీకొబ్బరి బోండాలు ఇళ్లలో లేకుండా చూసుకోవాలని, త లుపులు కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలంటూ ఫ్లెక్సీతో నినాదాలు చేస్తూ గ్రామవీధుల్లో ర్యాలీ కొనసాగించారు. డాక్టర్ ఇందిర, ఇజాజ్ అహ్మద్, సుబ్బారావు, జానమ్మ, పలువురు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



గొట్టిపాడులో జరిగిన మలేరియా అవగాహనా ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ మేరి యూనిస్

పెదనందిపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సీహెచ్‌వో ఎస్ఆర్‌కే ప్రసాద్‌స్వామి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం పెదనందిపాడులో మలేరియా వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. దోమకాటు ఆరోగ్యానికి చేటు.. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఎస్కే సుప్రజ, చెన్నయ్య, పి.అరుంధతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

కాకుమాను, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియాని నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్వర్ణరాజశేఖర్, ప్రసాద్ అన్నారు. శుక్రవారం జాతీయ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గృహాల్లో, బయట దోమలు వృద్ధి చెందే నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలని సూచించారు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాల న్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గొట్టిపాడులో...

ప్రత్తిపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిపాడులో పీహెచ్‌సీ సిబ్బంది మలేరియాపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వరల్డ్ మలేరియా డేని పురస్కరించుకుని ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మేరి యూనిస్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కే చల్లమ్మ, పీహెచ్ఎన్ నిర్మల, సూపర్‌వైజర్ విజయకుమారి, ఏఎన్ఎం కళావతి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ



తుళ్లూరులో తోపుడు బండ్లని అందజేస్తున్న టీడీపీ నాయకులు జొన్నలగడ్డ కిరణ్‌కుమార్

తుళ్లూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్ కుమార్ ఆర్థిక సహకారంతో శుక్రవారం చిరు వ్యాపారులకు తుళ్లూరులో తోపుడు బండ్లని పంపిణీ చేశారు. మంత్రి లోకేశ్ స్ఫూర్తితో బండ్లు పంపిణీ చేపట్టినట్లు కిరణ్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కాటా అప్పారావు, మాజీ అధ్యక్షుడు సీఆర్డీఏ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బండ్ల పట్టాభిరామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేశ్వరావు, నాయకులు జమ్ముల అనిల్, మూల్పూరి రాంబాబు, జెట్టి రమేష్, కొమ్మినేని సాంబయ్య సైదులు, జమ్ముల బాబి పాల్గొన్నారు.



లాలుపురంలో మానవహారంగా ఏర్పడిన జనసేన నాయకులు

ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఐక్యం కావాలి

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఐక్యం కావాలని జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం జనసేన రాష్ట్ర అధ్యక్షుడు కొణిదెల పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు గుంటూరు రూరల్ మండలంలోని లాలుపురం గ్రామంలో మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా జనసేన ప్రత్తిపాడు సమన్వయకర్త క్రొపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశంలో ఎక్కడ నక్కి ఉన్నా వారిని ఏరిపారేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పు వెంకటరత్తయ్య, డేగల లక్ష్మీనారాయణ, నాగినేని సునీల్‌కుమార్, సజ్జల రవి, శీలం చిన్న, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, అరవింద్, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు అందించాలి

పెదనందిపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు సబ్సిడీపై రుణాలు అందించాలని సుభిక్ష సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కొల్లా సీతారామయ్య అన్నారు. ఈమేరకు శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడుకు వినతిపత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి పేదలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

మత్తు పదార్థాల వినియోగం పెరుగుతోంది

తాడికొండ ఎస్ఐ ఎం.జోజి

తాడికొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందని ఎస్ఐ ఎం.జోజి అన్నారు. శుక్రవారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్స్, సీఎల్‌పీటీ నేషనల్ సర్వీస్ స్కీమ్ సంయుక్తంగా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీని తాడికొండలో నిర్వహించారు. ర్యాలీని ఎస్ఐ ప్రారంభించి మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వలన యువత బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అనంతరం ర్యాలీగా ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ కేఎన్ రజనీకాంత్, డాక్టర్ నాగరాజు, కానిస్టేబుల్ జీ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడికొండలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థులు

జాతీయ రహదారిపై ఆటో బోల్తా

● నలుగురికి తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని యనమదల వద్ద జాతీయరహదారిపై ఆటోబోల్తాపడి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన అబ్దుల్‌రవూఫ్, షేక్‌జుబేర్, షేక్‌అజ్‌గర్, షేక్‌జహీర్‌లు గుంటూరు నుండి ఆటోలో చిలకలూరిపేటకు వెలుతున్నారు. యనమదల సమీపంలో ముందు వెలుతున్న కారు షడన్‌గా పక్కకుతిప్పడంతో వెనుకనుండి కారును వేగంగా ఢీకొట్టాడు. దీంతో ఆటో బోల్తాపడింది. అందులోని నలుగురుకి తీవ్రగాయాలుకాగా 108లో జీజీహెచ్‌కు తరలించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి



ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న యూనిట్ ఇన్‌చార్జ్ శశికాంత్

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భూములు సారవంతం అయ్యేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని ప్రకృతి వ్యవసాయ ముట్లూరు యూనిట్ ఇన్‌చార్జ్ -2 శశికాంత్ సూచించారు. మండలంలోని ముట్లూరులో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏ రుతువులో ఏ పంటలు వేసుకోవాలనే విషయమై రైతు సేవా కేంద్ర వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శశికాంత్ మాట్లాడుతూ పీఎండీఎస్ కిట్ల ద్వారా 30 రకాల విత్తనాలు పొలంలో కలిసేలా దుక్కిలో చల్లుకోవాలని సూచించారు. పంట దశలో వచ్చిన వాటిని ఉపయోగించుకొని మిగిలిన వాటిని దుక్కిలో కలయ దున్నవటం ద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు వై జాన్‌కుమారి, పీ గోపీనాథ్, బీ వెంకటనాగసుధ, పీ చక్రవర్తి, శ్రీకన్య, ఎఫ్ఎస్ నవీన్‌కుమార్, రైతు సేవా కేంద్రం ఏవో షాహిద్, సచివాలయం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందుతులను కౌన్సెలింగ్‌కు పిలుస్తుండటంతో కక్ష కట్టి కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై స్థానిక ఐతానగర్‌కు చెందిన వేము నవీన్ అలియాస్ కిల్లర్, చెంచుపేటకు చెందిన చేబ్రోలు విక్టర్, ఐతానగర్‌కు చెందిన దోమ రాకేశ్, మంగళగిరికి చెందిన షేక్ కరిముల్లాలు దాడి చేశారు. వీరిలో మొదటి ముగ్గురిపై పలు స్టేషన్లలో కేసులతోపాటు రౌడీషీట్లు కూడా ఉన్నాయి. గంజాయి కేసుల్లో నిందుతులుగా ఉన్న ముగ్గురిని పలుమార్లు కౌన్సెలింగ్ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు పిలుస్తున్నాడని కానిస్టేబుల్ చిరంజీవిపై కక్షకట్టారు. గురువారం సాయంత్రం ఐతానగర్ సెంటర్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న చిరంజీవిని అడ్డగించి కొట్టి చంపాలన్న ఉద్దేశంతో కత్తులు తీసుకొని వెంటపడ్డారు. తప్పించుకొని తెనాలి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చిరంజీవి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుంటూరు చానల్ పనులు వెంటనే ప్రారంభించాలి

● నల్లమడ రైతు సంఘ నాయకుల వినతి

పెదనందిపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గుంటూరుచానల్ పొడిగింపు పనులు వెంటనే ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘ నాయకులు శుక్రవారం కలెక్టర్ నాగలక్ష్మికి, ఇరిగేషన్ ఎస్ఈలకు వినతిపత్రాలు అందజేశారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేసి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి ఈ ప్రాంత తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. తాగు, సాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నేతలు కొల్లా రాజమోహనరావు, యార్లగడ్డ అంకమ్మచౌదరి, మన్నవ హరిప్రసాద్, లావు అంకమ్మచౌదరి పాల్గొన్నారు.



దుగ్గిరాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జబీన్

మంత్రి లోకేశ్ సహకారంతోనే అభివృద్ధి

● సర్వసభ్య సమావేశంలో దుగ్గిరాల ఎంపీపీ జబీన్

దుగ్గిరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ సహకారంతో రూ.కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీపీ షేక్ జబీన్ తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లో అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు కళ్లకు కట్టినట్లు తెలుస్తోందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం మండలంలోని చింతలపూడి-రేవేంద్రపాడు మధ్య 14 కి.మీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు 83 శాతం ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. 18 గ్రామాల్లో రూ.2 కోట్లతో చేపడుతున్న 26 అభివృద్ధి పనులకు సంబంధించి సమావేశం ఆమోదం తెలిపింది. రేవేంద్రపాడు, పెదకొండూరు, చినపాలెం గ్రామాల్లో పశువులషెడ్ల నిర్మాణానికి రూ.8.76 లక్షలకు, గ్రామసభలో ద్వారా గుర్తించిన పనులకు రూ.3 లక్షలకు అంచనా మొత్తాన్ని నీటియాజమాన్య సంస్థకు పంపుతూ తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. జడ్పీటీసీ మేకతోటి అరుణకుమారి, ఎంపీడీఓ ఏ. శ్రీనివాసరావు, డీఎంపీడీవో జవహర్, ఏవో చంద్రమోహన్, ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య, తహసీల్దార్ సునీత, ఏఈలు సుబ్బారావు, కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, మురళీకృష్ణస్వామి, టీడీపీ కొప్పుల మధుబాబు, చిలువూరు రోజమరియమ్మ, విశ్వనాధపల్లి శివకుమారి, వైసీపీ ఎంపీటీసీ ం తాడిబోయిన పద్మావతి, కో-ఆప్షన్ సభ్యుడు వహీదుల్లా తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతు కుటుంబానికి లోకేశ్ అండ

● బేతపూడిలో 15 గేదెల మృతి.. రూ.5లక్షల సాయం



మంత్రి లోకేశ్ పంపిన ఆర్థికసాయాన్ని ప్రసాదరావుకు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గేదెలు మృతి చెంది ఆర్థికంగా నష్టపోయిన ఓ పాడి రైతు కుటుంబానికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. మంగళగిరి మండలం బేతపూడి గ్రామంలో కలవకొల్లు ప్రసాదరావుకు చెందిన రూ.18 లక్షల విలువైన 15 పాడి గేదెలు ఐదు రోజుల క్రితం మృతి చెందాయి. దీంతో జీవనాధారం కోల్పోయామని ఆదుకోవాలని స్థానిక నేతల ద్వారా మంత్రి లోకేశ్ దృష్టికి ప్రసాదరావు తీసుకువెళ్లారు. స్పందించిన లోకేశ్ శుక్రవారం స్థానిక నేతల ద్వారా రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేయించారు. ప్రసాదరావు మిత్రులందరూ కలిసి మరో రూ.3 లక్షలు అందజేశారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి లోకేశ్ స్పందించి సహృదయంతో రైతు కుటుంబాన్ని ఆదుకున్నారని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, వైస్‌చైర్మన్ యర్రగుంట్ల భాగ్యారావు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, నేతలు మల్లవరపు వెంకట్ కోసూరు గోవిందరావు, గైరుబోయిన భాస్కరరావు, తాడిబోయిన వెంకటేశ్వరరావు, జుట్రు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో వధూవరులకు పెళ్లి కానుక అందజేస్తున్న టీడీపీ నేతలు


మంత్రి లోకేశ్ పంపిన పెళ్లికానుక అందజేత

మంగళగిరి సిటీ, తాడేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డుకు చెందిన యేమినేని శివనాగేశ్వరరావు కుమారుడు దుర్గాసతీశ్, హేమశ్రీ వివాహం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లి కానుకను స్థానిక టీడీపీ నేతలు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు వాకా మాధవరావు, నేతలు జొన్నాదుల బాలకృష్ణ, గంజి చంద్రశేఖర్‌రావు, ఆకురాతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన బుల్లా మనోహర్ కుమార్తె శైలజ-ప్రవీణ్ నూతన దంపతులకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను టీడీపీ నేతలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

డ్రోన్ నిఘాతో జూదరుల వెన్నులో వణుకు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో పోలీసుశాఖ నిర్వహిస్తున్న డ్రోన్ నిఘాతో పేకాట, కోడిపందాల రాయుళ్ళకు వెన్నులో వణుకు పుట్టిస్తున్నది. ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి సహకారంతో పోలీసుశాఖకు అందించిన డ్రోన్ ఇప్పటికే గ్రామాలను జల్లెడపట్టింది. ఆయా గ్రామాల పరిధిలో డ్రోన్ తీసిన చాయా చిత్రాలు నేరుగా వట్టిచెరుకూరు పోలీసు స్టేషన్‌తో పాటు డీఎస్పీ కార్యాలయానికి కూడా అనుసంధానం చేశారు. దీంతో గ్రామాల్లో పేకాట, కోడిపందాలు నిర్వహించేందుకు జూదరులు భయపడుతున్నారు. శుక్రవారం సీఐ రమానాయక్ కాంత్రపాడులో డ్రోన్ వినియోగించి అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్న ప్రదేశాలను పరిశీలించారు. అటువంటి చర్యలను కట్టడి చేస్తామని సీఐ తెలిపారు.



కాట్రపాడులో శుక్రవారం డ్రోన్ విజువల్స్‌ను పరిశీలిస్తున్న సీఐ

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోదం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాలల వేసవి వినోదం కార్యక్రమాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మీ తెలిపారు. శుక్రవారం నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల వేసవి వినోదం కార్యక్రమం ప్రారంభమైంది. వేసవి శెలవులలో చిన్నారులకు సైన్స్ ప్రయోగాలు, పేపర్‌తో బొమ్మలు తయారు చేయడం, హ్యాండ్ రైటింగ్, పాటలు నేర్చుకోవడం, స్పోకెన్ ఇంగ్లీష్, కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 28 వరకు కార్యక్రమాలను కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు శివనాగేశ్వరరావు, మండల కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల వ్యక్తిగత వివరాలపై సర్వే

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో పొడిచెత్తను సేకరించే అసంఘటిత కార్మికుల వివరాల సమగ్ర సర్వే నిర్వహించనున్నామని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న డీబీఆర్సీ సభ్యులతో కలసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీబీఆర్సీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జూన్ నెలలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగులు సంఘం తెనాలి యూనిట్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశాలకు ముఖ్యమంత్రిని కూడా ఆహ్వానిస్తున్నామన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి ఆర్థికసాయం

తెనాలి రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న కుటుంబానికి సొపాటి కిరణ్ మిత్రబృందం అండగా నిలిచారు. మండలంలోని మల్లెపాడు శాంతినగర్‌కు చెందిన పొలిమట్ల చంటి గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కుటుంబపోషణ ఇబ్బందిగా ఉందని తెలుసుకున్న సభ్యులు శుక్రవారం వారిని పరామర్శించి నిత్యవసరాలతో పాటు రూ.10,000 ఆర్థికసాయం అందించారు. సొపాటి కిరణ్, సుధీర్, చిలకా కిరణ్, అత్తోట ప్రసాద్, వింజమూరి యేసురాజు, డి.శ్యామ్, కోపల్లె శ్రీనివాసరావు, రావూరి ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థి మనోజ్ఞకు సత్కారం

తెనాలి రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా పది ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 591 మార్కులు సాధించి గ్రామానికే మద్దినేని మనోజ్ఞ గర్వకారణంగా నిలిచిందని సంగం జాగర్లమూడి సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆ విద్యార్థిని, వారి తల్లిదండ్రులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జయనాగలక్ష్మి, కూటమి నాయకులు పాలడుగు రవీంద్ర, కొత్తరమేష్‌బాబు, పలువురు గ్రామ పెద్దలు కలిసి అభినందించారు.

కానిస్టేబుల్‌పై దాడి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న తమను కౌన్సిలింగ్‌కు పిలుస్తుండటంతో కక్ష కట్టి కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై స్థానిక ఐతానగర్‌కు చెందిన వేము నవీన్ అలియాస్ కిల్లర్, చెంచుపేటకు చెందిన చేబ్రోలు విక్టర్, ఐతానగర్‌కు చెందిన దోమ రాకేశ్, మంగళగిరికి చెందిన షేక్ కరిముల్లాలు దాడి చేశారు. వీరిలో మొదటి ముగ్గురిపై పలు స్టేషన్లలో కేసులు ఉన్నాయి. వీరిపై రౌడీషీట్లు కూడా ఉన్నాయి. గురువారం సాయంత్రం ఐతానగర్ సెంటర్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న చిరంజీవిని అడ్డగించి, కత్తులతో దాడిచేసి హత్యకు యత్నించగా పారిపోయి తెనాలి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కొల్లిపర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : భర్త, అత్త, మామల వేధింపులతో వివాహిత ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మండల పరిధిలోని వల్లభాపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం వల్లభాపురం గ్రామానికి చెందిన చప్పిడి సంధ్యారాణి (23)కి సంతోష్‌తో ఆరు సంవత్సరాలు క్రితం వివాహం అయ్యింది. వీరికి బాబు, పాప. అత్త కుమారి, మామ వసంతరావు, భర్త సంతోష్ పెట్టే ఇబ్బందులు భరించలేక గురువారం సంధ్యారాణి వంటిపై డీజిల్ పోసుకుని నిప్పు అంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు సంధ్యారాణిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ కోటేశ్వరరావు శుక్రవారం హాస్పటల్‌కు వెళ్ళి ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సంక్షిప్తం...

● పొన్నూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యమనేత డాక్టర్ కత్తి పద్మారావు, స్వర్ణకుమారి దంపతులను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ పశ్చిమ గోదావరి జిల్లా నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారికి అస్పృశ్యుడు యుద్ధగాథను కత్తి పద్మారావు బహూకరించారు.

● పొన్నూరు టౌన్ (చేబ్రోలు): మండల పరిధిలోని శలపాడులో ఇటీవల వీచిన పెనుగాలులకు చంద్రశేఖరస్వామి ఆలయ ధ్వజస్తంభం ధ్వంసమైంది. దీంతో నూతన ధ్వజస్తంభ ఏర్పాటుకు శుక్రవారం ఆలయ నిర్వాహకులు, అర్చక స్వాములు శ్రీకారం చుట్టారు.

● తెనాలి అర్బన్: దేవాలయాల్లో పనిచేసే క్షురకులకు రూ.25వేలు వేతనం ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడంపై నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ కురగంటి రఘురామయ్య హర్షం వ్యక్తం చేశారు. క్షౌరశాలలకు 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ జీవో కూడా జారీ చేయాలని కోరారు.

పాత వంతెన పదిలమేనా...!?


ప్రమాదకరంగా ఉన్న వంతెనకు ఏర్పాటుచేసిన అప్రోచ్ రోడ్డు

- కొల్లిపర వంతెనపై అధికలోడు వాహనాల ప్రయాణం
- ఇష్టారాజ్యంగా వంతెనపై ఇసుక రవాణాతో ముప్పు
- నూతన బ్రిడ్జి నిర్మాణానికి రిటైనింగ్‌వాల్ తొలగింపు
- కూలిన మట్టిగోడలు...ఆందోళనలో లంక గ్రామాల రైతులు


వంతెన పక్కన నూతనంగా జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

కొల్లిపర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర సమీపంలోని రేపల్లె కాల్వపై ఉన్న వంతెన మనుగడపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. కాల్వపై ఏర్పాటు చేసిన బ్రిటీషు కాలం నాటి వంతెన పరిస్థితి ప్రమాద భరితంగా ఉంది. మండల కేంద్రం కొల్లిపర కృష్ణానది తీరాన ఉచిత ఇసుక రేవులకు అనుమతి ఇవ్వడంతో ఈ వంతెన మీదుగానే ముమ్మరంగా ఇసుక రవాణా జరుగుతోంది. కృష్ణానదికి అనుకుని ఉన్న గ్రామాలకు మాత్రమే ఉచిత ఇసుక అనుమతి ఇవ్వమని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ అందుకు భిన్నంగా జిల్లాలోనే ఇతర ప్రాంతాలకు వందలాది ట్రాక్టర్లు భారీలోడుతో ఇసుక తరలిస్తున్నారు. ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నా అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో స్థానిక నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వందలాది ట్రాక్టర్లు అధికలోడుతో వంతెనపై నిత్యం రవాణా జరుగుతుండటంతో వంతెన కూలిపోతుందేమోనని లంక గ్రామాల రైతులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఈ వంతెన శిథిలావస్థకు చేరిందని భారీ వాహనాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం అమలు కావటంతో అధికారులను లెక్కచేయకుండా యధావిధిగా ఈ వంతెనపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. భారీలోడులతో వందలాది ఇసుక ట్రాక్టర్లు రాకపోకలు కొనసాగించడంతో వంతెనకు ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు ప్రమాదభరితంగా మారింది. దీంతో లంకగ్రామాలు రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. వంతెన శిథిలావస్థకు చేరుకుందని గత నెలలో రూ.4.19 కోట్ల నిధులతో నిర్మించనున్న హైలెవల్ నూతన వంతెన నిర్మాణానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ శంకుస్థాపన చేశారు. యుద్ధ ప్రాతిపతికన వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే పాత వంతెన పక్కన నిర్మాణ పనులు జరగటంతో పునాదులు నిమిత్తం రిటైనింగ్‌వాల్ తొలగించడంతో పాటు మట్టిని కూడా తవ్వడంతో వంతెనకు ఏర్పాటు చేసిన అప్రోచ్‌రోడ్డు మరింత బలహీనపడింది.

దీనికితోడు ప్రజలకు తాగునీరు అవసరం కావడంతో రేపల్లె కాల్వకు నీటిని అధికంగా విడుదల చేయడంతో ఉరవడికి వంతెన దగ్గర ఏర్పాటు చేసిన మట్టికోతకు గురయ్యింది. దీంతో భారీ వాహనాల రవాణా కారణంగా అప్రోచ్ రోడ్డు దగ్గర మట్టి విరిగిపడిపోయింది. దీంతో వంతెన పరిస్థితి ప్రమాదకరంగా మారింది. కొత్త వంతెన నిర్మాణ పనులు పూర్తి అయ్యేలోపే పాత వంతెన కూలిపోతుందేమోనని లంకగ్రామాల రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొత్తవంతెన నిర్మాణ పనులు పూర్తయ్యేవరకు పాత వంతెనపై రవాణా రాకపోకలు పూర్తిగా నిలిపి వేయాలని లంక గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

మున్సిపల్ భవనాన్ని ఖాళీచేయండి

అధికారులకు మంత్రి మనోహర్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్, పక్కన కమిషనర్ శేషన్న, ఆర్వో రాంప్రసాద్ తదితరులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల నాటి మున్సిపల్ భవనాన్ని ఖాళీ చేసి నూతన భవన నిర్మాణాలకు అవసరమైన పనులు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మనోహర్ చర్చించి వందేళ్ల నాటి పురపాలక భవనాన్ని తొలగించి పీపీపీ పద్ధతిలో అన్ని అంశాలతో నూతన భవనాన్ని నిర్మించుకుందామని అందుకు అవసరమైన అనుమతులను ఇప్పటికే ప్రభుత్వం నుంచి తీసుకోవడం జరిగిందన్నారు. పుర ప్రజలకు మున్సిపాలిటీ పరిపాలనకు చెందిన వివిధ విభాగాలకు ఆటంకం జరగకుండా మునిసిపల్ మార్కెట్ కాంప్లెక్స్ బిల్డింగ్‌లోకి మార్చాలన్నారు. ఇదే విధంగా మహిళలకు అనేక విధాలుగా ఉపయోగపే మెప్మా విభాగాన్ని మహిళ మండలి భవనంలోకి మార్చాలన్నారు. పట్టణ మురుగు నీటితో శివారు పంట భూములు కలుషితమౌతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని దీనిని అరికట్టేందుకు మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలన్నారు. పట్టణ శివారు గ్రామాలైన మల్లిపాడు, పినపాడు, ఐతానగర్, చెంచుపేట వంటి పలుప్రాంతాల్లో బరియల్‌గ్రౌండ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తహసీల్దార్ గోపాలకృష్ణను ఆదేశించారు. తెనాలి పట్టణలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మధ్యలో ఆగిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్‌లు, మునిసిపల్ స్కూల్ నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను తనకు అందచేయాలని, వాటిని పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, వోఎస్‌డీ ఏసురత్నం, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంఈ శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసులు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఆర్వో రాంప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శివన్నారాయణ, వాణి, టీపీవో సాంబశివారావు, మెప్మా మేనేజర్ విజయకుమారి, ఏఈలు సునీల్‌కుమార్, సూరిబాబు, జానీబాషా, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలిని తీర్చిదిద్దుకుందాం

తెనాలి రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రాంతాన్ని మహానగరాలకు దీటుగా తీర్చిదిద్దుకుందామని అందుకు ప్రజలందరు సహకరించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం తెనాలి పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి మనోహర్ అధికారులు, కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని 30వ వార్డులో రూ.39.20లక్షలతో తెనాలి - గుంటూరు ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకూ వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనచేశారు. అనంతరం 31వ వార్డులోని రావి టవర్స్ నుంచి కోనేరు బజార్ వరకూ రూ.40లక్షలతో డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తదుపరి బుర్రిపాలెం రోడ్డులోని రైతు బజారు నుంచి 8వ వార్డు శ్రీకృష్ణ ఆలయం వరకూ రూ.40లక్షలతో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. 8వ వార్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.32లక్షలతో శంకుస్థాపన చేశారు. బుర్రిపాలెం రోడ్డు విస్తరణలో భాగంగా గత 60ఏళ్లుగా నివసిస్తున్న కుటుంబానికి పెదరావూరు లే ఓట్‌లో ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయించి ఆ పట్టాను మంత్రి మనోహర్ లబ్ధిదారులకు అందించారు. మనోహర్ వెంట పలువురు కౌన్సిలర్లు, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ బోర్డులు ప్రారంభం

తెనాలి రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి మునిసిపల్ కూరగాయల మార్కెట్ రోడ్డుకు వెళ్లేందుకు ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తకుండా నటరాజ్ జ్యూయలర్స్ సహకారంతో ఏర్పాటుచేసిన బోర్డులను పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ శుక్రవారం ప్రారంభించారు. వీటిని అందించిన నటరాజ్ జ్యూయలర్స్ అధినేతను మంత్రి మనోహర్ అభినందించి దుశాలవాలతో సత్కరించారు. ముప్పా విజయలక్ష్మి స్మారకసేవాసమితి సహకారంతో పోలీసులకు వేసవి తాపానికి తట్టుకునేలా టోపీలు, కూలింగ్ గ్లాసులు, మాస్కులు అందించారు. సమాజ సేవలో ముందుంటున్న సంస్థ నిర్వాహకులు ముప్పా సత్యనారాయణను మంత్రి మనోహర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ జనార్ధన్‌రావు,ఛైర్‌పర్సన్ తాడిబోయినరాధిక, కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, పలువురు అధికారులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై నిరసన


మున్సిపల్ మార్కెట్ ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

తెనాలిరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతియుత ర్యాలీ నిర్వహించి మార్కెట్ రోడ్డులోని ప్రధాన రహదారిపై మానవాహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా ఉంటున్న భారతదేశంలో ఉగ్రవాదుల దాడులతో యావత్ భారతీయుల రక్తం మరుగుతోందన్నారు. ఏ పాపం తెలియని పర్యాటకులపై అతి కిరాతకంగా ఉగ్రవాదులు మతంపేరిట తూటాలతో బలితీసుకోవడం తీవ్రంగా ఖండించదగ్గవిషయమన్నారు. దేశ ప్రధాని ఉగ్రమూకలపై ఉక్కుపాదం మోపి మరో ఘటనకు తావులేకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. మృతుల కుటుంబాలకు జనసేన తరుపున ప్రగాడసానుభూతిని వ్యక్తం చేశారు. పలువురు జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రదర్శన చేశారు. అమరులైన 26మంది పర్యాటకులకు సంతాపం తెలిపారు. రజక పార్కు నుంచి స్వరాజ్ సెంటర్ వరకు క్యాండిల్ ర్యాలీ చేశారు. దాడికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. పలు పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: ఉన్మాదంతో సామాన్యుల ప్రాణాలను బలిగొంటున్న పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని తుదిమొట్టించాలని జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు డిమాండ్ చేశారు. జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం పొన్నూరు పట్టణంలో నిరసన ప్రదర్శన, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక జనసేన కార్యాలయం నుంచి పట్టణంలో ఐలాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ జరిగింది. కొవ్వొత్తుల చేతబూని ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ, మండలానికి చెందిన నాయకులు వీశంశెట్టి సూర్య, తాళ్లూరి అప్పారావు, నాయుడు వెన్నం, శివశంకర్, యలవర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న జనసేన నాయకులు

దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్


బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో వరుసగా రాత్రి పగలు తేడా లేకుండా దొంగతనాలు జరగటంతో ఈ విషయం తెలుసుకున్న మంత్రి మనోహర్ పోలీసు అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. దొంగతనం జరిగిన బాధితులైన ముద్దరబోయిన కుమారి, రెడ్డి మల్లారెడ్డి, గుడిబండి బసివిరెడ్డి తదితరులను పరామర్శించారు. దొంగలను పట్టుకు తీరుతారని భరోసా ఇచ్చారు. డీఎస్పీ జనార్ధనరావు, సీఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావును పిలిచి మండలంలో ఇప్పటివరకు ఎన్ని దొంగతనాలు జరిగాయని ఎటువంటి చర్యలు తీసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాలపై జాగ్రత్త వహించాలని రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. మనోహర్ వెంట నాయకులు యర్రు వెంకయ్యనాయుడు, అడపా నారాయణరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి తదితరులు ఉన్నారు.

డీవీసీ పథకాలతో పశు పోషకులకు భరోసా

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 25: సంగం డెయిరీ అమలు చేస్తున్న డీవీసీ అభయ పథకాలతో పశు పోషకులకు భరోసా లభిస్తుందని సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని ఆరేమండలో పశు రైతుకు రూ.70 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ జాన్‌భాషా అనే పాడి రైతు పశువు మృతి చెందగా డీవీసీ అభయ పశు సంక్షేమ పథకం ద్వారా డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పరిహారాన్ని రైతుకు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సంగం .పాలక వర్గ సభ్యుడు బొర్రు రామారావు పాల కేంద్రం నిర్వాహకులు గరిగంటి సాయిబాబు, షేక్ సైదావలి, బీఎంసీ ఇన్‌చార్జి శ్రీకాంత్, తదితరులు పాడి రైతును పరామర్శించిన చెక్కు అందించారు.

పొన్నూరు అర్బన్ సీఐగా వీరానాయక్


బాధ్యతలు స్వీకరిస్తున్న వీరానాయక్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణ అర్బన్ సీఐగా ఎల్.వీరానాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పొన్నూరు అర్బన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రవికిరణ్ బదిలీపై గుంటూరు వెళ్లారు. గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న వీరానాయక్ పొన్నూరు బదిలీపై వచ్చారు. నూతనంగా సీఐగా వచ్చిన వీరానాయక్‌ను ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

టీడీపీ గ్రీవెన్స్‌కు బాధితుల వినతులు

తెనాలిరూరల్, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం దాదాపుగా ఎనిమిది పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచి బిల్లులు ఎక్కువ వచ్చామంటూ అర్హత ఉన్న తమకు పింఛన్లు నిలుపుదల చేశారని పలువురు బాధితులు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు అర్జీలు అందించారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజవర్గంలో పలువురు బాధితులు వచ్చి వారి సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, కొల్లిపర మండలం వంగాసాంబిరెడ్డి, మహమ్మద్ ఖుద్దుస్, పెండేల వెంకట్రావు, జొన్నాదుల మహేష్, కనక రాంబాబు పాల్గొన్నారు.

'స్పౌజ్ పింఛనుకు దరఖాస్తు చేసుకోండి'

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ పింఛన్లతో ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు మేలు జరుగుతుందని టీడీపీ అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ చౌదరి వెల్లడించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లు పొందుతున్న భర్త చనిపోతే ఆ పింఛను భార్యకు వర్తిస్తుందన్నారు. సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మాజీ కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

స్టాక్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించండి

● రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కోటేశ్వరరావు


స్టాక్ నాణ్యతలను పరిశీలిస్తున్నసివిల్‌సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు

తెనాలిరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి డీలర్లకు పంపిణీ చేసే స్టాక్‌లో నాణ్యత ప్రమాణాలతో పాటు తూకాలను సరిచూసుకుని పంపిణీ చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పినపాడు వద్ద ఉన్న ఎమ్ఎల్ఎస్ పాయింట్‌ను, సుల్తానాబాద్‌లోని ఏఎంసీ గోడౌన్లను కేసన కోటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కందిపప్పు, బియ్యం, పంచదార వంటి వాటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డీలర్లకు పంపిణీ చేసే స్టాక్‌లో తూకం తక్కువగా వస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయన్నారన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద తప్పనిసరిగా ప్రతి బస్తాను తూకంవేసి పంపించాలని సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ అనుపమ, సీఎస్‌డీటీ జాన్, గొడౌన్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ సంజన సింహ

శారదా సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయం

● సబ్ కలెక్టర్ సంజన సింహా

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శారదా సర్వీస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని సబ్ కలెక్టర్ సంజన సింహా పేర్కొన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన హెల్త్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. 24 గంటల పాటు ప్రథమ చికిత్స గుండె వ్యాధులు, క్యాన్సర్, స్క్రీనింగ్, హెచ్‌పీవీ వ్యాక్సిన్ వంటి సేవలను సొసైటీ చేపట్టడం సామాజిక బాధ్యతను ఎంతగానో గుర్తించారని చెప్పారు. ప్రతి ఒక్కరిలో సామాజిక స్పృహ అవసరమన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్, డైట్, న్యూట్రిషన్, ఓబెసిటి అంశాలలో కూడా ప్రజల్లో అవగాహన కల్పించడం పట్ల డాక్టర్ శారదను అభినందించారు. ఉమామహేశ్వరావు, సుబ్బారావు, రాంబాబు, సోమయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ల ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో వ్యాక్సిన్ల ప్రయోజనాలపై డాక్టర్ శారద విద్యార్థులకు అవగాహన కల్పించారు. శారదా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి వివిధ రకాల క్యాన్సర్ల గురించి తెలిపారు. మహిళలకు వచ్చే వ్యాధులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రావిపాటి వీరనారాయణ, వేజళ్ల ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, రవికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు ఉచిత ప్రవేశాలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజోతి): ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో బలహీన వర్గాల పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉచిత ప్రవేశాలపై ముద్రించిన పోస్టర్లను ఎంఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన వర్గాలు, గ్రామాలలో వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు పట్టణాలలో రూ.1.44 లక్షలలోపు ఉన్న కుటుంబాల పిల్లలకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, నివాస ధృవీకరణ పత్రాలతో ఈ నెల 28 నుంచి మే 15 వరకు దగ్గరలోని సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా రహిత తెనాలిగా మారుద్దాం

● ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నపూర్ణ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మలేరియా రహిత పట్టణంగా తెనాలిని మారుద్దామని ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేటలోని పట్టణ మలేరియా కార్యాలయంలో ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియాపై అవగాహన కల్పించి మలేరియా నిర్మూలనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. అనంతరం ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీని ఇన్‌చార్జ్ సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నపూర్ణ, ఎంహెచ్‌వో డాక్టర్ ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నపూర్ణ, హెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మలలు జెండాఊపి ప్రారంభించారు. శివాజీచౌక్‌లో మానవహారంగా నిలబడిప్రతిజ్ఞ చేశారు.

● కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర గ్రామాల్లో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుమతి, హెల్త్ అసిస్టెంట్‌లు శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, సీహెచ్‌వో కల్యాణి, ఏఎన్ఎంలు అనిత, మణిమ్మ, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

● పొన్నూరుటౌన్, చేబ్రోలు: పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా వ్యాధిని నివారించవచ్చని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అబ్రహం లింకన్ అన్నారు. శుక్రవారం పొన్నూరు, చేబ్రోలులో జాతీయ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులో మలేరియా నివారణ పై అవగాహన ర్యాలీ జరిగాయి. మలేరియా వ్యాధి కీటక జనిత వ్యాధుల గురించి అవగాహన జరిగింది. కార్యక్రమంలో పొన్నూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షారోను, హరిబాబు, చేబ్రోలు వైద్యాధికారులు డాక్టర్ శైలజ, నర్సింగ్ విద్యార్థులు తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.